తెలంగాణ TELANGANA MUCHATLU



ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శనివారం - 14 - నవంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 160 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా మహేశ్ మురళీధర్ భగవత్ బాధ్యతలు

* బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో బాధ్యతలు చేపట్టిన ఐపీఎస్ అధికారి
* శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం
* మహిళల భద్రత, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి
* అవినీతిపై జీరో టాలరెన్స్ విధానమే లక్ష్యం

హైదరాబాద్, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు):

హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి డాక్టర్ మహేశ్ మురళీధర్ భగవత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పోలీసు శాఖలోని కీలక అంశాలు, నగరంలో శాంతిభద్రతల పరిస్థితి, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలపై ఆయన దృష్టి సారించారు. నగర పోలీసు వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహించేందుకు తన ప్రాధాన్యతలను వెల్లడించారు.

నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని మహేశ్ మురళీధర్ భగవత్ స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయడం, నేరాలను నియంత్రించడం, శాంతిభద్రతలను కాపాడటం తమ ప్రధాన బాధ్యతలని పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు నగరంలో

మిగతా 2 లో..



భారత్ సమ్మిట్‌తో తెలంగాణకు ప్రపంచస్థాయి గుర్తింపు

- భారత్ సమ్మిట్‌తో రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు
- సుమారు 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులకు ఆహ్వానం
- పెట్టుబడులు, పర్యావరణం, మానవ వనరులపై చర్చలు
- దేశంలోనే అత్యుత్తమ గిగ్ కార్మికుల విధానం తీసుకొచ్చాం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణలో ఉన్న మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా భారత్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ 2026 సందర్భంగా బోధి పెవిలియన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, కేంద్ర మాజీ విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, పలువురు ఎంపీలతో కలిసి ఆయన మాట్లాడారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ ప్రపంచ పెట్టుబడుల సదస్సు నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను అంతర్జాతీయ స్థాయిలో వివరించేందుకు భారత్ సమ్మిట్ వేదికగా నిలుస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. గతేడాది కూడా భారత్ సమ్మిట్ నిర్వహించామని, పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు సాగుతోందని చెప్పారు. ఈసారి దాదాపు 70 దేశాలకు చెందిన వివిధ రంగాల నిపుణులు, మంత్రులు, పర్యావరణవేత్తలు, పెట్టుబడిదారులు, పాత్రికేయులు సహా సుమారు వెయ్యి

మిగతా 2 లో..





పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

- రైతులకు ఇబ్బందులు లేకుండా పక్కా ప్రణాళిక : మంత్రి
- అవసరమైతే కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంపు
- కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరగకుండా చర్యలు
- వచ్చే సీజన్ పంటల సాగుపై రైతులకు అవగాహన

నల్లగొండ, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను రాబోయే పది రోజుల్లో పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ధాన్యం సేకరణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. జిల్లాలో ఈసారి ధాన్యం ఉత్పత్తి భారీగా పెరిగిన నేపథ్యంలో కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం జరగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. రైతులు తమ పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ధాన్యం సేకరణకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. లక్ష్యాన్ని నిర్ణయించిన గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ధాన్యం ఉత్పత్తి అధికంగా ఉన్నప్రాంతాల్లో అవసరాన్ని బట్టి కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని మంత్రి తెలిపారు. కేంద్రాల్లో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ధాన్యం సేకరణలో ఎక్కడా జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతులు రోజుల తరబడి

మిగతా 2 లో..

ట్రక్ పార్క్ భూముల

వేలాన్ని అడ్డుకుంటాం

- మూసాపేటలో స్థలాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల బృందం
- స్థానికులు, ట్రక్ డ్రైవర్లు, కార్మికులతో చర్చ
- ప్రజా అవసరాల భూములను ఎలా అమ్ముతారంటూ ప్రభుత్వంపై ప్రశ్నలు
- స్థానికులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హరీశ్ రావు భరోసా

హైదరాబాద్, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు):



కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని మూసాపేటలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన ట్రక్ పార్క్ భూములను ప్రభుత్వం వేలం వేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆందోళన చేపట్టింది. శుక్రవారం మాజీ మంత్రి హరీశ్ రావు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందంతో కలిసి ట్రక్ పార్క్ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూములను వేలం వేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులను పరిశీలించి భూముల వినియోగం, వేలం ప్రతిపాదనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.

అనంతరం స్థానిక ప్రజలు, ట్రక్ డ్రైవర్లు, కార్మికులతో హరీశ్ రావు మాట్లాడారు. ట్రక్ పార్క్ భూముల వేలం ప్రతిపాదనతో ఎదురవుతున్న సమస్యలు,

మిగతా 2 లో..

మినీ రిజర్వాయర్‌గా ఫాక్స్ సాగర్

- పునరుద్ధరణ పనులు ప్రారంభం
- చెరువుకు కొత్త రూపు తీసుకొచ్చేందుకు హైడ్రా చర్యలు
- ఐదు మీటర్ల మేర పూడిక తొలగింపునకు ప్రణాళిక
- వెయ్యి నుంచి నాలుగు వేల మిలియన్ లీటర్లకు సామర్థ్యం పెంపు
- మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతాం: హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు):



మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల ప్రాంతంలోని చారిత్రక ఫాక్స్ సాగర్ చెరువు పునరుద్ధరణ పనులకు హైడ్రా శ్రీకారం చుట్టింది. ఆక్రమణలు తొలగించడంతో పాటు మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలతో దుర్గంధభరితంగా మారిన చెరువుకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. శుక్రవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. చెరువును మినీ రిజర్వాయర్ తరహాలో అభివృద్ధి చేయడంతో పాటు మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దనున్నట్లు ప్రకటించారు. ఏడాది కాలంలో ఫాక్స్ సాగర్ రూపురేఖలు పూర్తిగా మారి అందమైన సరస్సుగా కనిపిస్తుందని వెల్లడించారు.

ఒకప్పుడు సాగునీరు, తాగునీటి అవసరాలు తీర్చిన ఈ చెరువు ప్రస్తుతం మురుగునీరు, ప్లాస్టిక్, రసాయన వ్యర్థాలు, గుర్రపుడెక్కతో తీవ్రంగా దెబ్బతిన్నదని రంగనాథ్ తెలిపారు. పెద్దఎత్తున పూడిక పేరుకుపోవడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. దీంతో పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గిపోవడమే కాకుండా, కలుషిత నీటి కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వివరించారు. ఈ పరిస్థితులను మార్చేందుకు చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, శుద్ధి చేసిన నీటితో నింపేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. గతంలో మాధాపూర్‌లోని తమ్మిడికుంటను హైడ్రా అభివృద్ధి చేసిన తరహాలోనే ఫాక్స్ సాగర్‌ను కూడా సుందరంగా

మిగతా 2 లో..

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా మహేశ్ మురళీధర్ భగవత్ బాధ్యతలు

(మొదటి పేజీ తరువాయి)

ఎదురవుతున్న సమస్యలను సమర్థంగా పరిష్కరించేందుకుప్రణాళికాబద్ధంగాముందుకు సాగనున్నట్లు తెలిపారు. మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు నూతన కమిషనర్ వెల్లడించారు. మహిళలు నిర్భయంగా నగరంలో ప్రయాణించేలా, పని ప్రదేశాలు, బహిరంగ ప్రాంతాల్లో సురక్షిత వాతావరణం ఉండేలా పోలీసు చర్యలను బలోపేతం చేయడం తమ ప్రాధాన్యతల్లో ఒకటిగా పేర్కొన్నారు. అదే సమయంలో సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. సాంకేతికతను ఉపయోగించుకుని మోసాలకు పాల్పడుతున్న నేరగాళ్లను అడ్డుకోవడం, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచడం కూడా తన ప్రధాన ప్రాధాన్యతల్లో ఒకటని మహేశ్ మురళీధర్ భగవత్ పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం, రహదారులపై వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవడంపై దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసు వ్యవస్థను రూపొందించడంతో పాటు పౌరుల సమస్యలకు వేగంగా స్పందించే విధంగా సేవలను మరింత మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అవినీతికి ఏమాత్రం తావు లేకుండా జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నగరంలోని సీనియర్ పోలీసు అధికారులతో మహేశ్ మురళీధర్ భగవత్ సమావేశమయ్యారు. నగర పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడం, ప్రస్తుతం ఎదురవుతున్న ప్రధాన సవాళ్లు, వాటి పరిష్కార మార్గాలపై అధికారులతో చర్చించారు. వివిధ విభాగాల పనితీరు, సమన్వయం, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించే అంశాలపై సమీక్షించారు. శాంతిభద్రతలు, మహిళల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ వంటి కీలక అంశాల్లో సమర్థవంతమైన చర్యలతో ముందుకు సాగాలని నిర్ణయించారు.

భారత్ సమ్మిట్‌తో తెలంగాణకు ప్రపంచస్థాయి గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

మంది ప్రతినిధులను ఆహ్వానించినట్లు వెల్లడించారు.

రెండు రోజులపాటు వివిధ అంశాలపై సదస్సులు, చర్చలు నిర్వహించి తీర్మానాలు చేయనున్నట్లు రేవంత్‌రెడ్డి వివరించారు. తెలంగాణలో ప్రజాస్వామిక వాతావరణం, పెట్టుబడులకు అనుకూల పరిస్థితులు ఉన్నాయనే విషయాన్ని ఈ వేదిక ద్వారా ప్రపంచానికి తెలియజేయాలనుకుంటున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడులు, మానవ వనరులు, వాతావరణం వంటి అంశాలపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకుంటారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో చర్చలు, సంప్రదింపుల ద్వారా సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలని, వివిధ అభిప్రాయాల్లో అత్యుత్తమ విధానాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులు తిరిగి వెళ్లిన తర్వాత తెలంగాణకు ప్రచారకర్తలుగా మారుతారనే ఆశాభావం వ్యక్తం చేశారు.

దేశవ్యాప్తంగా గిగ్, వేదిక ఆధారిత కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వారికి తగిన రక్షణ లేదని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమ గిగ్ కార్మికుల విధానాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఈ విధానాన్ని ఆవిష్కరించే కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఆహ్వానించినట్లు వెల్లడించారు. రెండు రోజుల భారత్ సమ్మిట్‌లోనూ రాహుల్ గాంధీ తన సందేశాన్ని వినిపిస్తారని చెప్పారు. ఢిల్లీలో నిర్వహించిన తెలంగాణ ప్రపంచ పెట్టుబడుల సదస్సు ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను ఆహ్వానించిన విషయాన్ని కూడా గుర్తుచేశారు. సమ్మిట్‌ను గుడ్డిగా వ్యతిరేకించడం సమర్థనీయం కాదని రేవంత్‌రెడ్డి అన్నారు. అర్థరహితమైన ఆరోపణలతో ప్రజలను పక్కదారి పట్టించవద్దని విజ్ఞప్తి చేశారు. తెలంగాణను 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం, రాష్ట్రంలోని అవకాశాలను ప్రపంచానికి తెలియజేయడం వంటి లక్ష్యాలతో పెట్టుబడుల సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సాంస్కృతికంగా, సాంకేతికంగా హైదరాబాద్ సాధించిన అభివృద్ధిని పరిచయం చేస్తూ మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ ప్రయత్నాలకు అడ్డుపడకుండా సహకరించాలని కోరారు.

ట్రక్ పార్క్ భూముల వేలాన్ని అడ్డుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

తమకు కలిగే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను ప్రభుత్వం అమ్మకానికి పెట్టడంపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ట్రక్ పార్క్ అందుబాటులో లేకపోతే డ్రైవర్లు, కార్మికులు ఎదుర్కొనే సమస్యలను ఆయనకు వివరించారు. స్థానికుల ఆందోళనను పరిగణనలోకి తీసుకున్న హరీశ్ రావు ట్రక్ పార్క్ భూముల వేలాన్ని కచ్చితంగా అడ్డుకుంటామని హామీ ఇచ్చారు. ఈ విషయంలో స్థానిక ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన భూములను వేలం వేయడంపై ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

స్థల పరిశీలన అనంతరం అక్కడ నిర్వహించిన ధర్నాలో హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ట్రక్ పార్క్ భూముల వేలం ప్రతిపాదనపై తమ అభ్యంతరాలను వెల్లడించారు. ప్రజలు, ట్రక్ డ్రైవర్లు, కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. స్థానికుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీలు రాజు శంభీపూర్, నవీన్ కుమార్‌తో పాటు సీపీఐ, సీపీఎం నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన ట్రక్ పార్క్ స్థలాన్ని కాపాడాలనే డిమాండ్‌తో నిర్వహించిన ఈ ఆందోళనలో స్థానికులు కూడా పాల్గొన్నారు.

పాదయాత్రలో రోడ్డు ప్రమాదంపై తీన్మార్ మల్లన్న ఫిర్యాదు





- **డీజీపీని కలిసి సమగ్ర దర్యాప్తు కోరిన ఎమ్మెల్సీ**
- **లారీ ఢీకొట్టిన ఘటనపై అనుమానాలు వ్యక్తం**
- **ఉద్దేశపూర్వక దాడి కోణంలోనూ విచారణ జరపాలని విజ్ఞప్తి**
- **సీసీటీవీ, ఎలక్ట్రానిక్ ఆధారాలు భద్రపరచాలని కోరిన నేత**

హైదరాబాద్, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): బీసీ రాజ్యాధికార పాదయాత్రలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం అన్నాజీపురం-తిరుమలగిరి రోడ్డు సమీపంలో జరిగిన ఈ ఘటన అనుమానాస్పదంగా ఉందని, దీనిపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. తనతో పాటు పాదయాత్రలో పాల్గొంటున్న వారి భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ డీజీపీకి వినతిపత్రం అందజేశారు.

వలిగొండ నుంచి తొర్రూరు జాతీయ రహదారి వైపు పాదయాత్ర కొనసాగుతున్న సమయంలో వేగంగా వచ్చిన లారీ తన వాహనంతో పాటు మరో కారును బలంగా ఢీకొట్టిందని తీన్మార్ మల్లన్న ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో తన సిబ్బందితో పాటు మరో వాహనంలో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయని తెలిపారు. ప్రమాదం జరిగిన తీరు, పరిస్థితులు అనుమానాలకు తావిస్తున్నాయని, తన రాజకీయ కార్యకలాపాలను వ్యతిరేకిస్తున్న కొందరు వ్యక్తులు బీసీల రాజకీయ సాధికారత కోసం చేపట్టిన ఉద్యమాన్ని అడ్డుకోవాలనే ఉద్దేశంతో ఈ ఘటనకు పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. తనకు హాని కలిగించాలనే కుట్ర జరిగిందా అనే కోణంలోనూ విచారణ జరపాలని కోరారు.

ఈ ఘటనపై తక్షణమే తగిన చట్టపరమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని డీజీపీని కోరారు. దర్యాప్తు బాధ్యతలను డీఎస్పీ స్థాయికి తగ్గకుండా సీనియర్ పోలీసు అధికారికి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదానికి కారణమైన లారీ యజమాని, డ్రైవర్ వివరాలు, వాహన రిజిస్ట్రేషన్, యాజమాన్య సమాచారం, డ్రైవర్ ఉద్యోగ సంబంధాలు, గతంలో ఆ వాహనం ప్రయాణించిన మార్గాలపై విచారణ జరపాలని సూచించారు. తనను లక్ష్యంగా చేసుకునేందుకు ఎవరైనా లారీని లేదా డ్రైవర్‌ను ఉపయోగించారా అనే విషయాన్ని నిర్ధారించాలని కోరారు. ప్రమాద ప్రాంతంలోని సీసీటీవీ దృశ్యాలు, జాతీయ రహదారి నిఘా కెమెరాల రికార్డులు, సమీపంలోని వ్యాపార సంస్థలు, భవనాల్లోని కెమెరాల దృశ్యాలు, మొబైల్ ఫోన్ వీడియోలు, కాల్ రికార్డులు సహా ఇతర ఎలక్ట్రానిక్ ఆధారాలను వెంటనే భద్రపరచాలని తీన్మార్ మల్లన్న కోరారు. ముందస్తుగా తనపై నిఘా పెట్టారా, రాజకీయ శత్రుత్వం కారణంగా ఈ ఘటన జరిగిందా, పాదయాత్రను అడ్డుకోవడానికి లేదా అందులో పాల్గొంటున్న వారికి హాని కలిగించడానికి ఎవరైనా ప్రయత్నించారా అనే అంశాలను కూడా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

బీసీలకు రాజకీయ, సామాజిక, రాజ్యాంగబద్ధమైన హక్కులు, తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే ప్రజాస్వామ్య లక్ష్యంతోనే పాదయాత్ర చేపట్టినట్లు తీన్మార్ మల్లన్న తెలిపారు. ఉద్యమంలో పాల్గొంటున్న వారిని బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం లేదా శారీరకంగా హాని కలిగించే ప్రయత్నాలు చేయడం తీవ్రమైన విషయమన్నారు. చట్టంపై, తెలంగాణ పోలీసుల నిష్పక్షపాత పనితీరుపై తనకు పూర్తి విశ్వాసం ఉందని, డీజీపీ వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని ఆధారాలు నాశనం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చట్టం ముందు నిలబెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీకుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి అశోక్ ముదిరాజ్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నర్సయ్య గౌడ్ పాల్గొన్నారు.

పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుతం నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వచ్చే సీజన్‌లో చేపట్టాల్సిన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, సాగు ప్రణాళికపై రైతులకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు. రైతులకు సరైన మార్గనిర్దేశం చేయడం ద్వారా సాగులో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించేందుకు కృషి చేయాలని చెప్పారు. రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మినీ రిజర్వాయర్‌గా ఫాక్స్ సాగర్

(మొదటి పేజీ తరువాయి)

తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

ఫాక్స్ సాగర్‌లో సుమారు ఐదు మీటర్ల మేర పూడిక తొలగించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు కమిషనర్ వెల్లడించారు. ప్రస్తుతం సుమారు వెయ్యి మిలియన్ లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం మాత్రమే ఉన్న చెరువును నాలుగు వేల మిలియన్ లీటర్ల సామర్థ్యానికి పెంచడం లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పూడిక తొలగింపు ద్వారా వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు పెరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. అభివృద్ధి పనులకు ముందు, తర్వాత చెరువులోని నీటితో పాటు పరిసర ప్రాంతాల్లోని భూగర్భ జలాలను జాతీయ పర్యావరణ ఇంజనీరింగ్ పరిశోధనా సంస్థ ద్వారా పరీక్షించనున్నట్లు వివరించారు. మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు నేరుగా చెరువులోకి చేరకుండా మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

చెరువులోకి వర్షపు నీరు చేరేలా చర్యలు తీసుకోవడంతో పాటు వరద ముప్పును నివారించేందుకు ప్రత్యేక నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు రంగనాథ్ తెలిపారు. 2000 సంవత్సరంలో వరదల సమయంలో ఎదురైన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఈ వ్యవస్థను పటిష్టం చేస్తామన్నారు. చెరువు కట్టను బలోపేతం చేయడంతో పాటు నీరు చేరే మార్గాలు, బయటకు వెళ్లే మార్గాలను సక్రమంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. చెరువు చుట్టూ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. నీటి నిల్వ సామర్థ్యం పెంచడంతో పాటు వరద నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడటమే ఈ పనుల ప్రధాన ఉద్దేశమని వివరించారు.ఫాక్స్ సాగర్‌కు చారిత్రక ప్రాధాన్యం ఉందని, 1897లో నిజాం పాలకుల కాలంలో దీనిని నిర్మించినట్లు చరిత్ర చెబుతోందని రంగనాథ్ పేర్కొన్నారు. సాగునీటి అవసరాలతో పాటు సికింద్రాబాద్ ప్రజలకు తాగునీరు అందించేందుకు ఈ చెరువును నిర్మించారని తెలిపారు. చెరువు నీరు నేరుగా హుస్సేన్‌సాగర్‌కు చేరేలా గతంలో వరద కాలువలు ఉండేవని, చెరువు కట్టపై నిర్మించిన పురాతన రాతి పంప్‌హౌస్ ద్వారా తాగునీటి సరఫరా జరిగేదని వివరించారు. ప్రస్తుతం దెబ్బతిన్న ఈ పంప్‌హౌస్‌ను పునరుద్ధరించేందుకు యూరప్‌కు చెందిన నిపుణుల సహకారం తీసుకోనున్నట్లు చెప్పారు. సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువులో 150 ఎకరాల మేర ఆక్రమణలను గుర్తించామని, వాటిలో చాలావరకు ఇప్పటికే తొలగించినట్లు వెల్లడించారు. 2024 జూలై 19న హైడ్రా ఏర్పాటుకు ముందే ఉన్న నివాస గృహాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించబోమని స్పష్టం చేశారు. భూములు, ప్లాట్లు కోల్పోయే వారికి నిబంధనల ప్రకారం బదిలీ చేయదగిన అభివృద్ధి హక్కులు (టీడీఆర్) కల్పిస్తామని తెలిపారు. చెరువు ప్రధాన కట్ట, పరిసర ప్రాంతాల భద్రత కోసం పది మీటర్ల బఫర్ జోన్‌ను పరిగణనలోకి తీసుకుంటామని, కట్ట దిగువన ఉన్న ఆలయాలు, ఇతర నిర్మాణాల విషయంలోనూ వరద ముప్పును దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు చేపడతామని హైడ్రా కమిషనర్ వెల్లడించారు.

రబీ పంటల ప్రణాళికపై కలెక్టర్లతో సీఎస్ సమీక్ష



- **వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**
- **వ్యవసాయం, ఉద్యానవన శాఖల పనితీరుపై చర్చ**
- **వరి ధాన్యం సేకరణ, భూసేకరణ అంశాలపై సమీక్ష**
- **పాఠశాల విద్యా రంగ పరిస్థితులపైనా ఆరా**

హైదరాబాద్, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సమీక్ష చేపట్టారు. జిల్లాల వారీగా ప్రభుత్వ శాఖల పనితీరు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పరిస్థితులపై కలెక్టర్లతో చర్చించారు.

వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై ప్రధానంగా సమీక్ష నిర్వహించారు. రబీ పంటల సాగు ప్రణాళిక, రైతులకు అవసరమైన ఏర్పాట్లు, వ్యవసాయ కార్యకలాపాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. జిల్లాల్లో పంటల సాగుకు సంబంధించి చేపడుతున్న చర్యలు, వ్యవసాయ శాఖ ద్వారా అందుతున్న సేవలపై చర్చించారు. ఉద్యానవన శాఖకు సంబంధించిన కార్యక్రమాల పురోగతిని కూడా సీఎస్ సమీక్షించారు. ఉద్యాన పంటల సాగు, సంబంధిత శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ల నుంచి వివరాలు సేకరించారు. రబీ సీజన్‌లో వ్యవసాయ, ఉద్యానవన రంగాలకు సంబంధించిన ప్రణాళికల అమలుపై దృష్టి సారించారు.

వరి ధాన్యం సేకరణ అంశాన్ని కూడా సమావేశంలో చర్చించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, జిల్లాల్లో జరుగుతున్న ఏర్పాట్లు, సంబంధిత అంశాలపై సమీక్షించారు. అదేవిధంగా వివిధ ప్రభుత్వ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ పురోగతిని తెలుసుకున్నారు. భూసేకరణకు సంబంధించిన అంశాలపై కలెక్టర్లతో చర్చించి వివరాలు సమీక్షించారు. పాఠశాల విద్యాశాఖకు సంబంధించిన అంశాలపైనా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహించారు. జిల్లాల్లో విద్యా రంగ పరిస్థితులు, పాఠశాలలకు సంబంధించిన కార్యక్రమాల అమలుపై కలెక్టర్లతో చర్చించారు. వ్యవసాయం, ఉద్యానవనం, ధాన్యం సేకరణ, భూసేకరణ, పాఠశాల విద్య వంటి కీలక రంగాలపై నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థాయి పరిస్థితులను సమీక్షించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
శనివారం - 14 - నవంబర్ 2026
వరంగల్ 03

ఘనంగా ప్రజాకవి కాళోజీ వర్ధంతి వేడుకలు



- కాళోజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు

కరీంనగర్, నవంబర్ 13(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ యాస, భాష, సంస్కృతిని తన రచనల ద్వారా ఎలుగెత్తి చాటిన ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కాళోజీ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

ప్రజాకవి, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత కాళోజీ నారాయణరావు వర్ధంతి వేడుకలు కరీంనగర్ నగరంలో ఘనంగా నిర్వహించారు. రేకుర్తిలోని కాళోజీనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు విగ్రహానికి మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు కార్పొరేటర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ యాస, భాషను తన రచనల ద్వారా ఎలుగెత్తి చాటిన మహోన్నత ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని, ఆయన జీవితం నేటి తరాలకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. “పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది” అని నినదించిన కాళోజీ జీవితం తెలంగాణ భాష, సాహిత్య సేవకే అంకితమైందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఆయన చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. కాళోజీ జన్మదినమైన సెప్టెంబర్ 9వ తేదీని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సుధగోని మాధవికృష్ణగౌడ్, బోయినపల్లి ప్రవీణ్ రావు, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, గాజ రమశివరాంతో పాటు స్థానిక నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జీవిత చరిత్రలను చదివి స్ఫూర్తి పొందాలి

- పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు



వనపర్తి,నవంబర్13(తెలంగాణ ముచ్చట్లు): విద్యార్థులు జాతీయ నాయకుల జీవిత చరిత్రలను చదివి, వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాల దిశగా ముందుకు సాగాలని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ పిలుపునిచ్చారు.తిరుమలహిల్స్‌లోని రేడియంట్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహనీయుల జీవిత చరిత్రలను ప్రతి విద్యార్థి చదవాలని సూచించారు. వారి నిజాయితీ, క్రమశిక్షణ, త్యాగనిరతి, దేశభక్తి వంటి గొప్ప లక్షణాలను అలవర్చుకోవాలని అన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు నాశనమవుతాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పాఠశాల సంచాలకురాలు కౌసల్య మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, మంచి దేశభక్తులుగా తయారై దేశాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. పట్టుదలతో కష్టపడి చదివితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని, విద్యార్థులే రేపటి భారతదేశ భవిష్యత్తు అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉప్పరి తిరుమలేష్ అన్నారు.పిల్లలు నైతిక విలువలు, మానవత్వం, సంస్కారంతో ఎదగాలని, తల్లిదండ్రులు, గురువులు, సమాజం గర్వపడేలా ప్రవర్తించాలని ఉప ప్రధానోపాధ్యాయులు బి. రాము సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సంచాలకులు కౌసల్య భాస్కర్, ప్రధానోపాధ్యాయులు ఉప్పరి తిరుమలేష్, ఉప ప్రధానోపాధ్యాయులు బి. రాము, పర్యావరణ పరిరక్షణ విభాగం సమన్వయకర్త శృతి, ఉపాధ్యాయులు రాహుల్, శాంతయ్య, శ్రీనివాస్, అఖిల్, క్రీడా ఉపాధ్యాయులు వెంకటేష్, మల్లేష్, ఖదిరున్నిసా, రామేశ్వరి, గీత, రజిత, శ్వేత, సరోజ, సాత్విక, జరీనా, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, సాహితీ కళా వేదిక సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం విజయవంతం



పెద్దమందడి,నవంబర్13(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం జగత్‌పల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పెంటన్న యాదవ్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు.ఈ శిబిరంలో అనారోగ్యంతో బాధపడుతున్న పశువులకు, గర్భకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న గేదెలకు ఉచితంగా వైద్య చికిత్సలు అందించారు. అదేవిధంగా దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు.రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో పశుగ్రాస కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ శ్యామ్ సూచించారు. వి.బి.జి.రామ్ జీ పథకం ద్వారా ఒక ఎకరం విస్తీర్ణంలో పశుగ్రాసం సాగు చేసే రైతులకు ప్రోత్సాహకంగా రూ.14,000 అందించే అవకాశం ఉందని వివరించారు. పశువుల పోషణకు అవసరమైన పశుగ్రాసాన్ని రైతులు తమ పొలాల్లోనే సాగు చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులతో పాటు పశువైద్య సిబ్బంది జగదీష్, వెంకటేష్, గోపాలమిత్రులు రవి, రఘు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే రూ.2 లక్షల నిధులు మంజూరు

- ఎమ్మెల్యే మేఘారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం



పెద్దమందడి,నవంబర్13(-తెలంగాణ ముచ్చట్లు): గ్రామ ప్రజల తాగునీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో తాగునీటి బోరు మోటారు, పైపుల ఏర్పాటుకు ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.2 లక్షలు మంజూరు చేసిన వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డికి గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన బోరు మోటారు, పైపుల ఏర్పాటుకు నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డికి గ్రామ ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే నిధుల ద్వారా ఆర్థిక సహాయం అందించడం గ్రామాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే సహకారం అందించాలని కోరారు.

ప్రమాదం జరిగే వరకు ఎదురుచూస్తారా? పీచరలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి!

వేలేరు, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచర గ్రామంలో రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రోడ్లపై చిన్నపిల్లలు, వృద్ధులు రాకపోకలు సాగించే సమయంలో కూడా కొందరు వాహనదారులు అతివేగంగా వెళ్తుండటంతో ప్రమాద భయం నెలకొంది. ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గ్రామంలోని ప్రధాన రహదారులపై అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అలుగునూర్‌లో దీక్షా దివస్ సభకు భారీ ఏర్పాట్లు

- ఈ నెల 29న బహిరంగ సభ.. కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరు.
- సభాస్థలి, పార్కింగ్ ఏర్పాట్లను నేతలతో కలిసి పరిశీలించిన మాజీ మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 29న అలుగునూర్‌లో నిర్వహించనున్న దీక్షా దివస్ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకత్వం సన్నాహాలు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి శుక్రవారం సభ నిర్వహించనున్న ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం ఎంపిక, వేదిక ఏర్పాటు, పార్కింగ్ సౌకర్యాలు, వాహనాల రాకపోకలు తదితర అంశాలపై నాయకులతో చర్చించారు. సభకు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని నిర్ణయించారు. ముఖ్యంగా వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాలను పరిశీలించి, సభా ప్రాంగణానికి చేరుకునే మార్గాలు, ట్రాఫిక్ నియంత్రణ, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై సమాలోచనలు జరిపారు.

కేటీఆర్ రాకతో సభకు రాజకీయ ప్రాధాన్యత

ఈ నెల 29న నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆయన పర్యటన నేపథ్యంలో సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టి సారించారు. సభా వేదిక నుంచి పార్కింగ్ వరకు అన్ని ఏర్పాట్లను ముందస్తు ప్రణాళికతో పూర్తి చేయాలని భావిస్తున్నారు.

దీక్షా దివస్ సభను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.

ఈ పరిశీలనలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్ రావు, మానకొండూర్ మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, కొత్తపల్లి మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం సహించేది లేదు.. నిర్వాహకులకు సర్పంచ్ హెచ్చరిక!

వేలేరు, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): హనుమకొండ జిల్లా వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని గ్రామ సర్పంచ్ జక్కుల మౌనిక-సంపత్ యాదవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది, ఆహార పదార్థాల నాణ్యత, వంట పాత్రల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. వంట చేసే ప్రదేశంలో పరిశుభ్రత సరిగా పాటించకపోవడంపై సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని వంట నిర్వాహకులకు హెచ్చరించారు.

విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంతో పాటు వంటగది, వంట పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కత్తి దయాకర్, వార్డు సభ్యురాలు బట్టు స్వప్న, పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన గడ్డి రేఖ రవి



- **షోడశపల్లిలో నిరుపేద కుటుంబానికి 50 కిలోల బియ్యం, రూ.5 వేల ఆర్థిక సాయం**

వేలేరు, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): నుమకొండ జిల్లా వేలేరు మండలం షోడశపల్లి గ్రామానికి చెందిన గొడుగు రాంబాయి అనారోగ్యంతో ఈ నెల 11వ తేదీన మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన ఎస్ఎస్ ఫంక్షన్ హాల్ అధినేత గడ్డి రేఖ రవి వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు.

ఈ సందర్భంగా మృతురాలి కుటుంబానికి 50 కిలోల బియ్యంతో పాటు రూ.5,000 నగదు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆపద సమయంలో నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి తన మానవత్వాన్ని చాటుకున్నారు.

కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేయడమే నిజమైన సేవ అని పలువురు గడ్డి రేఖ రవి సేవా దృక్పథాన్ని అభినందించారు.

బస్టాండ్ లేక ప్రయాణికుల అవస్థలు.. ఎండలో, వానలో రోడ్డు పైనే నిరీక్షణ!




- **వేలేరు మండల కేంద్రంలో బస్టాండ్ ఏర్పాటు చేయాలని ప్రజలు, ప్రయాణికుల డిమాండ్**

వేలేరు, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రంలో ప్రయాణికుల కోసం కనీసం బస్టాండ్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని నడిబొడ్డున ఉన్న అంబేద్కర్ సెంటర్ వద్దే ప్రయాణికులు బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎండ, వాన అనే తేడా లేకుండా బస్సుల రాక కోసం రోడ్డుపైనే నిల బడాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం కూర్చునేందుకు సీట్లు లేకపోవడంతో వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక మూత్రశాలల సౌకర్యం కూడా లేకపోవడంతో ప్రయాణికులు మరింత అవస్థలు ఎదుర్కొంటున్నారు.

మండల కేంద్రానికి నిత్యం వివిధ గ్రామాల నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయినప్పటికీ ప్రయాణికుల కనీస అవసరాలను తీర్చే బస్టాండ్ ఏర్పాటు చేయకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వేలేరు మండల కేంద్రంలో ప్రయాణికుల కోసం బస్టాండ్ నిర్మాణంతో పాటు కూర్చునే సౌకర్యం, మూత్రశాలలు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

అల్సర్ నొప్పితో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్య




జమ్మికుంట, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): జమ్మికుంట పట్టణంలోని 16వ వార్డు జైభీమ్ కాలనీకి చెందిన పుల్లూరి శ్యాంమూర్తి (34) అనారోగ్య సమస్యలతో మనస్తాపానికి గురై ఆత్మ హత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు.

వివరాల్లోకి వెళితే.. శ్యాంమూర్తి ఈ నెల 10వ తేదీన ఉదయం పనికి వెళ్లి సాయంత్రం 6:30 గంటలకు ఇంటికి తిరిగి వచ్చాడు. అనంతరం తాను గడ్డి మందు తాగినట్లు తల్లికి తెలిపి, మందు డబ్బాను చూపించాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి, అనంతరం హనుమకొండలోని ఓజస్ ఆసుపత్రికి తరలించారు.

అక్కడ చికిత్స పొందుతూ నవంబర్ 13వ తేదీ ఉదయం మృతి చెందాడు. మృతుడు కొంతకాలంగా అల్సర్ నొప్పితో బాధపడుతూ మందులు వాడుతున్నాడని, ఆ బాధతోనే జీవితంపై విరక్తి చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటాడని తల్లి పుల్లూరి రాధమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

- **నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ**



మానకొండూర్, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): మానకొండూర్ నియోజకవర్గంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు.

తిమ్మాపూర్ మండలంలోని ఎల్.ఎం.డి ప్రజా భవన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తిమ్మాపూర్ మండలానికి చెందిన 172 మంది అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా మండలంలోని నిరుపేద కుటుంబాలు, గుడిసెలు, రేకుల ఇళ్లలో నివసిస్తున్న వారికి ప్రాధాన్యతనిస్తూ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తుందని వివరించారు. లబ్ధిదారులు సకాలంలో ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించి, నిర్దేశిత సమయంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో చేరేలా నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

తాళ్లపల్లిలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం





- **రైతులు దళారులను ఆశ్రయించకుండా సీసీఐ కేంద్రాల్లోనే పత్తి విక్రయించాలి: ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ.**

మానకొండూర్, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): మానకొండూర్ నియోజకవర్గంలోని ఇల్లంతకుంట మండలం తాళ్లపల్లి గ్రామంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక పత్తి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు దళారులపై ఆధారపడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే తమ పత్తిని విక్రయించి కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) పొందాలని సూచించారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, సహకార సంఘం ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో రాజకీయ రగడ

- **కౌశిక్ రెడ్డికి ఆసక్తికర వ్యాఖ్యలతో కౌంటర్**



వీణవంక, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ లబ్ధిదారుల కళ్లలో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. గత పదేళ్లలో గత ప్రభుత్వం ఇళ్ల కేటాయింపుల విషయంలో నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు.

శుక్రవారం కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ప్రణవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయడంతో తమ కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు.

అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎక్కడున్నాయని ప్రశ్నించే ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటికి రిబ్బన్ కట్ చేయడం గమనార్హమన్నారు. రిబ్బన్ కట్ చేసే సమయంలో ఆ ఇంటి లబ్ధిదారుల కళ్లలో కనిపిస్తున్న ఆనందాన్ని కౌశిక్ రెడ్డి చూడాలని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పదేళ్ల పాటు హుజూరాబాద్ నియోజకవర్గంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా కేటాయించకుండా లబ్ధిదారులను మభ్యపెట్టారని విమర్శించారు. మొదటి విడతతో పాటు రెండో విడతలోనూ మరిన్ని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి పేదలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, మైనారిటీ నాయకులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జమ్మికుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతుల కొరత

- **మరుగుదొడ్లు లేక విద్యార్థుల తీవ్ర ఇబ్బందులు.. వెంటనే సమస్యలు పరిష్కరించాలి**
- **పిడిఎస్యు తెలంగాణ రాష్ట్ర కోశాధికారి అంగిడి కుమార్ డిమాండ్**



జమ్మికుంట, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): జమ్మికుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పిడిఎస్యు తెలంగాణ రాష్ట్ర కోశాధికారి అంగిడి కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కళాశాలలో బాలికలకు ఒకే ఒక మరుగుదొడ్డి అందుబాటులో ఉండగా, బాలురకు మరుగుదొడ్ల సౌకర్యం లేక బయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు.కళాశాల ఆవరణలో తాగునీటి సౌకర్యం సరిగా లేకపోవడంతో పాటు మరుగుదొడ్ల నిర్వహణ కూడా అధ్వాన్నంగా ఉందని, దీంతో విద్యార్థులు ముఖ్యంగా బాలికలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులు విద్యార్థుల చదువుకు ఆటంకంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి కళాశాలకు అవసరమైన నిధులు కేటాయించి, మరుగుదొడ్లు, తాగునీరు తదితర కనీస మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా కార్యదర్శి లోకిని మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షులు వెల్దిరాజు, యశ్వంత్, రామ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
శనివారం - 14 - నవంబర్ 2026

ఖమ్మంలో ఏజెంట్ల సమాఖ్య వరంగల్ డివిజన్ కార్యవర్గ సమావేశం

- సమావేశాన్ని జయప్రదం చేయాలని అధ్యక్షుడు పాసంగుల రామారావు పిలుపు



ఖమ్మం బ్యూరో, నవంబర్ 13(తెలంగాణ ముచ్చట్లు): భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య (లియాఫీ) వరంగల్ డివిజన్ కార్యవర్గ సమావేశం ఈనెల 15వ తేదీ ఆదివారం ఖమ్మం నగరంలో నిర్వహించనున్నట్లు డివిజన్ అధ్యక్షుడు పాసంగుల రామారావు, కార్యదర్శి రావుల నారాయణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఖమ్మంలోని హోటల్ రెస్ట్ ఇన్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరగనుందని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సమాఖ్య అఖిల భారత ప్రధాన కార్యదర్శి భీమిశెట్టి మార్కండేయులు, దక్షిణ మధ్య విభాగం ఉపాధ్యక్షుడు పుసులూరి రమేష్ బాబు, జోనల్ బాధ్యులు ఆకుల గాంధీ, గట్టు వెంకటాచార్యులు హాజరుకానున్నారు.

ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఎల్ఐసీలో చోటుచేసుకుంటున్న మార్పులు, ఏజెంట్ల సంక్షేమం,సమాఖ్యబలోపేతం వంటి అంశాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా ఏజెంట్ల కుటుంబ సభ్యులకు వైద్య బీమా సౌకర్యం కల్పించడం, గ్రాట్యుటీ పెంపు, సమూహ జీవిత బీమా సౌకర్యం మెరుగుదల వంటి అంశాలపై చర్చించనున్నారు.

అలాగే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో విజయవాడలో జరగనున్న అఖిల భారత సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చించనున్నారు. ఏజెంట్లకు సంబంధించిన పలు కీలక అంశాలపై అవగాహన కల్పించే ఈ విజ్ఞాన సదస్సుకు వరంగల్ డివిజన్ పరిధి నుంచి సుమారు 100 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల హక్కులు,సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేసే ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని డివిజన్ పరిధిలోని ఏజెంట్లకు అధ్యక్షుడు పాసంగుల రామారావు, కార్యదర్శి రావుల నారాయణ పిలుపునిచ్చారు.




చింతకాని మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన లింగాల కమల్ రాజు

- అనారోగ్యంతో బాధపడుతున్న వారికి పరామర్శ..
- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి

ఖమ్మం బ్యూరో, నవంబర్ 13(తెలంగాణ ముచ్చట్లు): ఖమ్మం జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, మధిర నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి ఇన్‌చార్జి లింగాల కమల్ రాజు శుక్రవారం చింతకాని మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి, మృతి చెందిన వారి కుటుంబాలను ఓదార్చారు.

ముందుగా ప్రొద్దుటూరు గ్రామంలో నిర్వహించిన అయ్యప్ప స్వాముల భిక్ష కార్యక్రమంలో పాల్గొని స్వాముల ఆశీస్సులు అందుకున్నారు.అనంతరం కోమట్లగూడెం గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురైన మాజీ సర్పంచ్ వేముల నర్సయ్య, సత్యనారాయణరెడ్డిలను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బస్వాపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన దొడ్డ బసవయ్య, మాజీ సర్పంచ్ ఆవుల ఆదెమ్మ, వరికూటి నరసింహారావు, చంద్రకాని గోవింద రావుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పందిళ్లపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న లింగం శ్రీనివాసరావు, వత్సవాయి నాగలక్ష్మిలను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ పర్యటనలో మండల భారత రాష్ట్ర సమితి నాయకులు మంకెన రమేష్, బొడ్డు వెంకట రామారావు, వంకాయలపాటి వెంకట లచ్చయ్య, గురజాల హనుమంతరావు, గడ్డం శ్రీను, బండి రామారావు, సర్పంచులు కొండూరి పరిశుద్ధ రావు, చాపలమడుగు వీరబాబు, కోపూరి నవీన్, నాదెండ్ల వెంకటేష్, మాజీ సర్పంచ్ కాలింగ డేవిడ్, తునికిపాటి పూర్ణచంద్రరావు, ఉపసర్పంచ్ ప్రసాదు, ప్రొద్దుటూరు పాపినేని రంగారావు, నల్లమోతు రాంబాబు, బత్తుల వెంకటేశ్వర్లు, పల్లపు అంకాలు, మాజీ సర్పంచ్ సోమ నాగేశ్వరరావు, అంబటి వెంకటి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మోజర్లలో నూతన రైస్ మిల్లు ప్రారంభం



పెద్దమందడి,నవంబర్13(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామ సమీపంలో భీమా భాస్కర్ అండ్ కంపెనీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన రైస్ మిల్లు ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు జి.వామన్ గౌడ్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ సహకార అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు భీషం చెన్నకేశవరెడ్డి పాల్గొని నూతన రైస్ మిల్లు యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నూతన పరిశ్రమలు ఏర్పాటు కావడం వల్ల స్థానికంగా ఆర్థిక కార్యకలాపాలు పెరగడంతో పాటు రైతులకు, ప్రజలకు పరోక్షంగా ప్రయోజనం చేకూరుతుందని ఆకాంక్షించారు. నూతనంగా ఏర్పాటు చేసిన రైస్ మిల్లు విజయవంతంగా కొనసాగాలని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గాడిల ప్రశాంత్,కనిమెట్ట సర్పంచ్ రామచంద్రయ్య యాదవ్, నాయకులు మోహన్ కుమార్, మైబు, నరేందర్ గౌడ్, నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ వెంకట్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నాగుల చవితి వేడుకలు.. ఆలయాలకు పోటెత్తిన భక్తులు

- నాగదేవతకు మహిళల ప్రత్యేక పూజలు.. భక్తిశ్రద్ధలతో పండుగ నిర్వహణ



జమ్మికుంట, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాల్లో నాగుల చవితి పర్వదినాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకొని ఆయా ప్రాంతాల్లోని ఆలయాలకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలు, నాగదేవత పుట్టల వద్ద భక్తుల సందడి నెలకొంది. మహిళలు పుట్ట వద్ద పసుపు, కుంకుమ సమర్పించి, పాలు పోసి సంప్రదాయబద్ధంగా మొక్కులు చెల్లించుకున్నారు. తమ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని నాగదేవతను ప్రార్థించారు. అనంతరం ఆలయాల్లో అర్చకుల చేతుల మీదుగా తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవోలు, అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





మాది పేదల పక్షపాత ప్రభుత్వం


- అందుకే రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లిచ్చాం
- కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేసిన లబ్ధిదారులకు ఈనెల 19 నుంచే ఆర్థిక తోడ్పాటు
- కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే మా లక్ష్యం
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ఖమ్మం బ్యూరో, నవంబర్ 13(తెలంగాణ ముచ్చట్లు): ఈ ప్రజా ప్రభుత్వం పేదల పక్ష పాత ప్రభుత్వమని, నిరంతరం వారి సంక్షేమానికి పాటుపడుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెడ్డిస్పష్టం చేశారు. చేయూత పథకంలో భాగంగా కూసుమంచిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో 1,071 మందికి, ఖమ్మం రూరల్ మండలంలోని ఎం.వెంకటాయపాలెం గ్రామంలోని హైస్కూల్ గ్రౌండ్ లో 851 మందికి నూతన పింఛన్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు, హైదరాబాద్ లో లక్ష ఇళ్లను పేదలకు కేటాయించామని, ఫైనల్ బిల్లులను ఈ నెలలోనే మంజూరు చేస్తామని ప్రకటించారు. గత పాలకులు పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని, ఎని మిదేళ్లలో ఒక్క పింఛన్ కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని అన్నారు. తమ ప్రజా ప్రభుత్వంలో చేయూత పింఛన్ల కోసం మంజూరు పత్రాలు అందజేస్తున్నామని, ఈనెల 19వ తేదీ నుంచే లబ్ధిదారులకు ఆర్థిక భరోసా అందిస్తుందని ప్రకటించారు. కూసుమంచి కేంద్రంలో వంద పడకల ఆసుపత్రితో పాటు కొత్తగా నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. కేంద్ర ప్రభుత్వానికి ఎన్నికల కమిషనర్ తొత్తుగా మారి 7కోట్ల ఓట్లను తొలగించారని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసుకోవడమే తమ లక్ష్యమని వెల్లడించారు.

ఈ కార్యక్రమాల్లో..: కాంగ్రెస్ పార్టీ కూసుమంచి మండల అధ్యక్షులు బజ్జురి వెంకటరెడ్డి, ఖమ్మం రూరల్ మండలాధ్యక్షులు తోట వీరభద్రం, పలువురు అధికారులు, సర్పంచ్ లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పసి హృదయాల పాలిట పెద్ద మనసు చాటుకున్న శీనన్న!

- తలసేమియా బాధిత చిన్నారులకు చేయూత పింఛన్ల మంజూరు
- మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన బాధితులు



ఖమ్మం బ్యూరో, నవంబర్ 13(తెలంగాణ ముచ్చట్లు): తలసేమియా వ్యాధితో పోరాడుతున్న చిన్నారుల జీవితాల్లో ఆర్థిక భరోసా నింపేందుకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీసుకున్న చొరవపై బాధిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. చేయూత పథకం కింద పింఛన్లు మంజూరు చేయించడంతో తమకు ఎంతో ఊరట లభించిందని పేర్కొంటూ శుక్రవారం పలువురు తలసేమియా బాధితులు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

గతంలో ఎంపీగా ఉన్నప్పుడే తలసేమియా బాధితుల సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించిన పొంగులేటి.. ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా కూడా వారి సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని గుర్తుచేశారు. ఆయన చొరవతో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ పరిధిలోని సుమారు 150 మంది చిన్నారులతో పాటు జిల్లాలోని వందలాది మంది బాధితులకు పింఛన్లు మంజూరు కానుండటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

తమ కష్టాలను గుర్తించి ఆర్థికంగా అండగా నిలిచిన శీనన్నకు చిన్నారులు, వారి కుటుంబ సభ్యులు, సంస్థ ఉపాధ్యక్షురాలు పొద్దుటూరి పావని, సభ్యులు అనిత, ఉదయ భాస్కర్ తదితరులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

ఖాకీ దుస్తుల్లో మెరవాలన్న కలను సాకారం చేసుకోండి

- మీ విజయానికి..మా మార్గదర్శకత్వం ఎల్లప్పుడూ ఉంటుంది
- నిరుద్యోగ యువతకు మంత్రి పొంగులేటి భరోసా
- పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఉచిత ఎస్సై, కానిస్టేబుల్ శిక్షణ శిబిరం సందర్శన
- అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



ఖమ్మం బ్యూరో, నవంబర్ 13(తెలంగాణ ముచ్చట్లు): పోలీసు ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో కష్టపడుతున్న నిరుద్యోగ యువత తమ కలలను సాకారం చేసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివి భవిష్యత్తులో ఖాకీ దుస్తుల్లో మెరవాలని అభ్యర్థులకు పిలుపునిచ్చారు. వారి విజయానికి అవసరమైన మార్గదర్శకత్వం, సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని భరోసా ఇచ్చారు.పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్, రైట్ ఛాయిస్ అకాడమీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో నిర్వహిస్తున్న ఉచిత ఎస్సై, కానిస్టేబుల్ శిక్షణ శిబిరాన్ని మంత్రి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అభ్యర్థులతో మాట్లాడి శిక్షణ, సన్నద్ధత తీరును తెలుసుకున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఆర్థిక భారం లేకుండా పోలీసు ఉద్యోగాలు సాధించే అవకాశం కల్పించాలన్న సదుద్దేశంతో ఎంత వ్యయమైనా వెనుకాడకుండా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నిరుద్యోగ అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ కోచింగ్ కార్యక్రమానికి ఏకంగా 1,25,000 మంది దరఖాస్తు చేసుకోవడం సంతోషకరమన్నారు. ఖమ్మంలో శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న రైట్ ఛాయిస్ అకాడమీ ఛైర్మన్ మెడెం కిరణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం అభ్యర్థులకు 16 పుస్తకాలతో కూడిన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. శిక్షణ అందిస్తున్న అధ్యాపక బృందాన్ని సత్కరించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ అభ్యర్థులంతా.. మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో..: మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌ఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, ఏదులాపురం మున్సిపాలిటీ వైస్‌ఛైర్మన్ తమ్మినేని నవీన్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఐనవోలు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన వరంగల్ సీపీ



- రికార్డులు, కేసుల వివరాలను పరిశీలించిన ఎన్. శ్వేత
- ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశం
- భక్తులకు మెరుగైన సేవలు అందించాలని సూచన
- సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని హితవు

వరంగల్, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత శుక్రవారం ఐనవోలు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీ నిర్వహించారు. స్టేషన్‌కు చేరుకున్న ఆమెకు పోలీసు అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో సీపీ కొబ్బరి మొక్కను నాటారు. తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసుల వివరాలు, నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. పెండింగ్ కేసులు, సిబ్బంది విధుల నిర్వహణ, బాధ్యతలు, పోలీస్ స్టేషన్ పనితీరుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలని, విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.
ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎన్. శ్వేత సిబ్బందికి సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, బాధితులకు న్యాయం జరిగేలా విధులు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను శ్రద్ధగా విని పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.
ఐనవోలులో శ్రీ మల్లికార్జున స్వామి పుణ్యక్షేత్రం ఉన్నందున ఇక్కడికి వచ్చే భక్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సీపీ సూచించారు. భక్తుల మనోభావాలు, ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పోలీసు శాఖ ప్రతిష్ఠను కాపాడుతూ భక్తులకు మెరుగైన సేవలు అందించాలని స్పష్టం చేశారు. పోలీసు సిబ్బంది వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని ఎన్. శ్వేత సూచించారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ తనిఖీలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామునూరు ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సీఐ సంతోష్, ఐనవోలు ఎస్ఐ అశోక్, సంగెం ఎస్ఐ పంశీకృష్ణ, పర్వతగిరి ఎస్ఐ రాజ్‌కుమార్‌తో పాటు ఐనవోలు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.





డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతాం..

- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- ఆరోగ్య సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన
- "నషా విముక్త్ భారత్" లో భాగంగా పాఠశాల విద్యార్థులకు చేపట్టిన క్విజ్ పోటీల కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి

ఖమ్మం బ్యూరో, నవంబర్ 13(తెలంగాణ ముచ్చట్లు): మాదకద్రవ్యాల మహమ్మారిని రాష్ట్రం నుండి పూర్తిగా తరిమికొట్టేందుకు రాష్ట్రప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, ఇందులో సమాజంలోని ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార మరియు పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నషా విముక్తి భారత్ కింద పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన డ్రగ్స్ నిరోధ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన క్విజ్ పోటీలలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఐపీఎస్ అధికారుల పర్యవేక్షణలో సుమారు 600 మంది సభ్యులతో ఈగల్ టీమ్ ను ఏర్పాటు చేసినట్లు, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8 వేల కేసులు నమోదు చేసి, 19 వేల మందికి పైగా నిందితులను అరెస్టు చేసి కఠిన శిక్షలు నమోదు చేశారన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి ఎవరు ఫోన్లు చేసి సిఫార్సులు చేసినా ఉపేక్షించేది లేదని, తన సొంత మనుషులైనా సరే చట్టప్రకారం జైలుకు పంపాలని పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని మంత్రి తెలిపారు. కేవలం విని యోగదారులపైనే కాకుండా, డ్రగ్స్ సరఫరా మూలాలను గుర్తించి వాటిని పూర్తిగా నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.
గత పాలనలో డ్రగ్స్ నియంత్రణపై చిత్తశుద్ధి కొరవడిందని, మాజీ మంత్రుల ఫామ్‌హౌస్‌లలో సైతం డ్రగ్స్ పట్టుబడటం దురదృష్టకరమని అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ ఉన్నా యన్న భయంతోనే నాటి మంత్రులు తమ పిల్లలను విదేశాల్లో చదివించుకున్నారని విమర్శించారు. కేవలం పోలీసు, ఎక్సైజ్ శాఖల వల్లే డ్రగ్స్ నియంత్రణ పూర్తిస్థాయిలో సాధ్యం కాదని, ఇందులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. చిన్నతనంలోనే పిల్లల ప్రవర్తనను గమనించి, చెడు అలవాట్ల వైపు వెళ్లకుండా వారిని కట్టడి చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే ఉపాధ్యాయులు పాఠాలతో పాటు విద్యార్థుల నడవడికపై కూడా కన్నేసి ఉంచాలని కోరారు.
ఈ కార్యక్రమంలో..: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ అదనపు కమిషనర్ కిషన్, డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, జిల్లా సూపరింటెండెంట్ డి. జానయ్య, ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రబీ సాగులో నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ప్రణాళిక

- వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి
- ధాన్యం కొనుగోళ్లలో కనీస మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు 90 శాతానికి పెంచాలి
- యంగ్ ఇండియా, తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

జనగామ, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): రాబోయే రబీ 202627 సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రాజెక్టుల్లో నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున వరి సాగును తగ్గించి, రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించాలని సూచించారు. ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగుతో పాటు సూక్ష్మ సేద్య విధానాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్య, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, గ్రామీణ ఉపాధి హామీ పనుల పురోగతిపై శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించి సమీక్షించారు.
రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. పంటల వైవిధ్యీకరణ, ఖరీఫ్ పంటల ఉత్పాదకత పెంపు, రైతు గుర్తింపు కార్డుల నమోదు, వ్యవసాయ యంత్రాల అద్దె కేంద్రాల ఏర్పాటుపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రైవేటు మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షించాలని, రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయించినా కనీస మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలను సిద్ధంగా ఉంచి రైతుల వివరాల నమోదు పూర్తి చేయాలని సూచించారు.
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరుపై కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సంజయ్ జాజు ఆదేశించారు. ముఖ గుర్తింపు హాజరు విధానం ద్వారా వివరాలు నమోదు చేస్తూ విద్యార్థుల హాజరు కనీసం 90 శాతానికి చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలల వారీగా హాజరు శాతాన్ని సమీక్షించాలని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు డిజిటల్ అభ్యసన వేదికలను వినియోగించుకోవాలని సూచించారు. ఉన్నత విద్యా మౌలిక సదుపాయాల అభివృద్ధి పథకాల కింద మంజూరైన 41 పనుల్లో ఎనిమిది పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు.
రాష్ట్రవ్యాప్తంగా రూ.11 వేల కోట్లతో నిర్మిస్తున్న 87 యంగ్ ఇండియా వసతి పాఠశాలల పనులను వేగవంతం చేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ఇప్పటివరకు ఈ పనులపై రూ.625 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రూ.1,108 కోట్లతో మంజూరైన 115 తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ఇందుకు అవసరమైన నిధులు కలెక్టర్ల వద్ద అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అవసరమైతే అదనపు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. వీధి కుక్కల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో కుక్కలను గుర్తించి నిబంధనల మేరకు పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు.
గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో నీటి సంరక్షణ నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపునకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. కాలువలను శుభ్రం చేసి అవసరమైన పనులు పూర్తి చేయాలని తెలిపారు. సమావేశం అనంతరం జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులతో సమీక్షించారు. విద్యార్థులు, సిబ్బంది హాజరు ముఖ గుర్తింపు విధానం ద్వారా వంద శాతం నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రతిరోజూ పర్యవేక్షించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

అర్హులందరికీ "చేయూత"నిస్తాం.. అండగా నిలుస్తాం

- గత ప్రభుత్వ హయాంలో..పేదలు కాళ్లరిగేలా తిరిగినా, కళ్ళు కాయలు కాసేలా చూసినా కనికరించలేదు
- దీపావళి నాడు తీపి కబురు చెప్పాం.. ఇప్పుడు పల్లెల్లో పింఛన్ల పండుగ తీసుకొచ్చాం
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- నేలకొండపల్లిలో 1,138 మంది నూతన పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ



ఖమ్మం బ్యూరో, నవంబర్ 13(తెలంగాణ ముచ్చట్లు): ఒంటరి మహిళలు, వితంతువులు, గీత, చేనేత కార్మికుల కుటుంబాల్లో ఆర్థిక భరోసా అందించాలని గొప్ప సంకల్పంతో మన ప్రజా ప్రభుత్వం చేయూత పథకం ద్వారా అర్హులందరికీ అండగా నిలుస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం నేలకొండపల్లిలోని మార్కెట్ యార్డు ప్రాంగణంలో చేయూత పథకం కింద నూతనంగా 1,138 మందికి పింఛన్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలోని 8 ఏళ్లలో కొత్త పింఛన్లు అనేదే ఇవ్వలేదని, కాళ్ళరిగేలా తిరిగినా, కళ్ళు కాయలు కాసేలా ఏళ్లుగా ఎదురుచూసినా వారు చలించలేదని, ఎన్నికలకు ముందు తన పర్యటనల్లో పేదల గోస చూసి ఆవేదన చెందానని మన ప్రజా ప్రభుత్వం వచ్చాక.. కొత్తగా పింఛన్లు ఇస్తున్నట్లు తెలిపారు. దీపావళి పండుగ రోజున రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల మందికి ఇవ్వబోతున్నట్లు ప్రకటించి.. ఆచరణలోకి తెచ్చామని అన్నారు. గత పాలకులు కమీషన్ల కోసం లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టి.. కూలేశ్వరంగా మిగిల్చారని విమర్శించారు. ఇంకా అర్హులు ఉంటే.. కచ్చితంగా పింఛన్లు మంజూరు చేసి అండగా నిలుస్తామని, ఎవరూ అధైర్య పడొద్దని అభయమిచ్చారు.
నేలకొండపల్లి మండలంలో 1,138 మందికి కొత్త పింఛన్లు..
నెలకు రూ.30.16 లక్షల మేర ఆర్థిక భరోసా
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పింఛన్ల పథకం ద్వారా నేలకొండపల్లి మండలంలో కొత్తగా 1,138 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. వీరికి ప్రతి నెలా మొత్తం రూ.30,16,208 పింఛను రూపంలో అందనుంది. నవంబర్ 13, 2026 నాటికి మండలంలో మంజూరైన కొత్త పింఛన్ల వివరాలను అధికారులు వెల్లడించారు.
వర్గాల వారీగా వివరాలు ఇలా..
దివ్యాంగులు - 361 మంది (నెలకు రూ.14,49,776)
ఒంటరి మహిళలు - 107 మంది (రూ.2,15,712)
గీత కార్మికులు - 64 మంది (రూ.1,29,024)
చేనేత కార్మికులు - ఇద్దరు (రూ.4,032)
వితంతువులు - 604 మంది *(రూ.12,17,664)
మొత్తంగా 1,138 మందికి నెలకు రూ.30.16 లక్షలకుపైగా పింఛన్ల రూపంలో ఆర్థిక సహాయం అందనుంది. దివ్యాంగులకు ఒక్కొక్కరికీ నెలకు రూ.4,016, మిగిలిన వర్గాలకు రూ.2,016 చొప్పున పింఛను మంజూరైనట్లు అధికారులు తెలిపారు. పాత పింఛన్లతో కలుపుకొని మొత్తం 9,428 మందికి నెలకు రూ.1,64,40,896 లబ్ధి చేకూరుతోందని వివరించారు.
ఈ కార్యక్రమంలో..: అడిషనల్ కలెక్టర్ శ్రీజ, కాంగ్రెస్ మండలాధ్యక్షులు కొడాలి గోవిందరావు, సీనియర్ నాయకులు శాఖమూరి రమేష్, నెల్లూరి భద్రయ్య, మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు బొడ్డు బొందయ్య, పలువురు సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, ప్రజా ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
శనివారం - 14 - నవంబర్ 2026
వరంగల్ 07

ప్రపంచ దేశాల చూపు.. బ్రహ్మోస్ వైపు!

- ఫిలిప్పీన్స్‌కు ఇప్పటికే సరఫరా
- వియత్నాంతో తాజాగా భారత్ ఒప్పందం
- మరికొన్ని దేశాలతో తుది దశకు చర్చలు
- ఆపరేషన్ సిందూర్‌తో పెరిగిన అంతర్జాతీయ డిమాండ్



డెస్క్, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): భారత్ అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులకు అంతర్జాతీయంగా ఆదరణ పెరుగుతోంది. ముఖ్యంగా ఆగ్నేయాసియా దేశాలు ఈ క్షిపణి వ్యవస్థను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. ఇప్పటికే ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోస్ క్షిపణులను సరఫరా చేయగా, తాజాగా వియత్నాంతోనూ భారత్ ఒప్పందం చేసుకుంది. వీటితో పాటు మరికొన్ని దేశాలు కూడా ఈ క్షిపణుల కొనుగోలుపై చర్చలు జరుపుతున్నాయి. ఈ చర్చలు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, మేనేజింగ్ డైరెక్టర్ జైతీర్థ్ ఆర్. జోషి శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఈ వివరాలను వెల్లడించారు.

బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థపై ఆసక్తి చూపిస్తున్న పలు దేశాలతో చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని జైతీర్థ్ జోషి తెలిపారు. భారత ప్రభుత్వం నుంచి అధికారిక అనుమతులు లభించిన వెంటనే కొత్త ఎగుమతి ఒప్పందాలు ఖరారయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఇప్పటికే కొన్ని దేశాలకు బ్రహ్మోస్ వ్యవస్థను అందించేందుకు మార్గం సుగమమవగా, మరిన్ని దేశాలు ఈ జాబితాలో చేరే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో భారత రక్షణ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లో గుర్తింపు పెరుగుతోంది. ముఖ్యంగా ఆగ్నేయాసియా ప్రాంతంలో బ్రహ్మోస్‌కు పెరుగుతున్న ఆదరణ భారత రక్షణ ఎగుమతులకు ప్రాధాన్యం తీసుకొస్తోంది.

ఆపరేషన్ సిందూర్ తర్వాత బ్రహ్మోస్ క్షిపణులపై ప్రపంచ దేశాల ఆసక్తి మరింత పెరిగిందని జోషి వివరించారు. ఈ ఆపరేషన్‌లో వినియోగించిన కొన్ని క్షిపణులు 10 నుంచి 15 ఏళ్ల క్రితం తయారైనవని, మరికొన్ని 20 ఏళ్ల కిందట రూపొందించినవని వెల్లడించారు. ఇంతకాలం నిల్వ ఉంచినప్పటికీ అవసరమైన సమయంలో వాటిని ప్రయోగించగా లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించాయని చెప్పారు. పాత క్షిపణులు కూడా సమర్థంగా పనిచేయడానికి నాన్‌డిస్ట్రక్టివ్ టెస్టింగ్ విధానం కీలకంగా నిలిచిందని వివరించారు. ఈ పరీక్షల ద్వారా పరికరాలకు నష్టం కలిగించకుండానే వాటి పనితీరు, నాణ్యతను నిరంతరం పరిశీలించవచ్చని తెలిపారు.

నాన్‌డిస్ట్రక్టివ్ టెస్టింగ్ అంటే ఒక వస్తువు లేదా పరికరాన్ని విడదీయకుండా, దానికి ఎలాంటి నష్టం కలిగించకుండా అంతర్గత లోపాలను గుర్తించే పరీక్షా విధానం. రక్షణ, అంతరిక్ష రంగాల్లో తయారైన క్షిపణులు, యుద్ధ విమానాలు, ఇతర సైనిక పరికరాలను కొన్నేళ్లపాటు నిల్వ ఉంచాల్సి ఉంటుంది. అవసరమైన సమయంలో అవి సరిగ్గా పనిచేయాలంటే వాటి నాణ్యత, దృఢత్వాన్ని ఎప్పటికప్పుడు పరీక్షించడం తప్పనిసరి. ఈ విధానంతో పరికరాల్లో ఏర్పడే లోపాలను ముందుగానే గుర్తించి, వినియోగానికి అనువుగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవచ్చు. ఫలితంగా అత్యవసర పరిస్థితుల్లో వాటి పనితీరుపై భరోసా కల్పించేందుకు వీలవుతుంది.

భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ, రష్యాకు చెందిన ఎన్‌పీఓ మషినోస్ట్రోయెనియా సంయుక్తంగా బ్రహ్మోస్ క్షిపణిని అభివృద్ధి చేశాయి. ఇది రెండు దశల్లో పనిచేసే సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి. మొదటి దశలో ఘన ఇంధన బూస్టర్ క్షిపణిని అధిక వేగానికి చేర్చగా, రెండో దశలో ద్రవ ఇంధన రామ్‌జెట్ ఇంజిన్ ప్రయాణ వేగాన్ని కొనసాగిస్తుంది. ఈ క్షిపణి గంటకు సుమారు 3,400 కిలోమీటర్ల వేగంతో, అంటే మాక్ 2.8 వేగంతో ప్రయాణించగలదు. ప్రపంచంలో అత్యంత వేగవంతమైన క్రూయిజ్ క్షిపణుల్లో ఒకటిగా గుర్తింపు పొందిన బ్రహ్మోస్ ఎగుమతులపై చర్చలు ఆశాజనకంగా సాగుతున్నాయి. ప్రభుత్వ అనుమతులు లభిస్తే మరిన్ని దేశాలతో ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది.


10+2 విద్యా విధానం.. మార్పుల దిశగా తెలంగాణ విద్యారంగం!

- పదో తరగతి తర్వాత చదువుకు స్వస్తి పలుకుతున్న విద్యార్థులు
- ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసే దిశగా అడుగులు
- విద్యార్థులకు నిరంతర విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- అమలులో లోపాలు లేకుండా చూడటమే అసలైన సవాలు



డెస్క్, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): విద్య అనేది కేవలం అక్షరజ్ఞానాన్ని అందించే సాధనం మాత్రమే కాదు.. ఒక వ్యక్తి భవిష్యత్తును, సమాజ పురోగతిని, దేశ అభివృద్ధిని నిర్ణయించే శక్తి. అందుకే విద్యావ్యవస్థలో చేసే ప్రతి మార్పు లక్షలాది మంది విద్యార్థుల జీవితాలపై ప్రభావం చూపుతుంది. తెలంగాణ ప్రభుత్వం తాజాగా పాఠశాల విద్యలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పదో తరగతి తర్వాత ప్రత్యేకంగా కొనసాగుతున్న ఇంటర్మీడియట్ విద్యను కూడా పాఠశాల విద్యలో భాగం చేసి 12వ తరగతి వరకు ఒకే విద్యా వ్యవస్థను కొనసాగించాలన్న ఆలోచన కొత్త చర్చకు తెరలేపింది. 2027-28 విద్యా సంవత్సరం నుంచి ఈ విధానాన్ని అమలు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం వెనుక విద్యార్థులు మధ్యలోనే చదువు మానేయకుండా ఉన్నత విద్య వరకు కొనసాగించాలన్న ఉద్దేశం కనిపిస్తోంది. అయితే ఒక విద్యా విధానాన్ని మార్చడం ఎంత ముఖ్యమో, ఆ మార్పు వల్ల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం కూడా అంతే ముఖ్యం.ప్రస్తుతం పదో తరగతి పూర్తయిన తర్వాత విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో చేరుతున్నారు. రెండేళ్ల విద్యాభ్యాసం అనంతరం ఉన్నత విద్య వైపు అడుగులు వేస్తున్నారు. అయితే ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పరిస్థితులు, సామాజిక సమస్యలు, విద్యాసంస్థలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో కొందరు విద్యార్థులు పదో తరగతి తర్వాతే చదువుకు దూరమవుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, పేద కుటుంబాలు, వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలు ఈ సమస్యను ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని మార్చి ప్రతి విద్యార్థికి 12వ తరగతి వరకు విద్య అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రభుత్వ లక్ష్యం ఆహ్వానించదగినదే. అయితే పాఠశాల విద్యలో 11, 12 తరగతులను చేర్చి తరగతులను పాఠశాల విద్యలోకి తీసుకువస్తే సబ్జెక్టుల బోధన, అధ్యాపకుల నియామకాలు, ప్రయోగశాలలు, పరీక్షల నిర్వహణలో ఎలాంటి మార్పులు చేస్తారన్నది స్పష్టత రావాలి. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలైన నీట్, జేఈఈతో పాటు రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ప్రస్తుత స్థాయిలోనే నాణ్యమైన శిక్షణ అందాలి. పాఠశాల విద్యలో భాగం చేస్తున్నామనే కారణంతో ఇంటర్మీడియట్ ప్రత్యేక బోధనా ప్రమాణాలు తగ్గిపోకూడదు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిపుణుల కమిటీతో సమగ్ర అధ్యయనం చేయించడం అవసరం.మరోవైపు ఈ నిర్ణయంతో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీల భవిష్యత్తు, అక్కడ పనిచేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది పరిస్థితులపై కూడా స్పష్టత ఇవ్వాలి.ఇప్పటికే ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలో పనిచేస్తున్న సంత మాత్రాన విద్యార్థుల డ్రాపౌట్స్ సమస్య పూర్తిగా పరిష్కారం కాదు. పేదరికం, రవాణా సౌకర్యాల కొరత, కుటుంబ బాధ్యతలు, బాల కార్మికత్వం వంటి మూల కారణాలను కూడా పరిష్కరించాలి. విద్యార్థులు పాఠశాలలకు వచ్చేలా ప్రోత్సాహకాలు, వసతి, రవాణా, నాణ్యమైన బోధన అందించినప్పుడే ఈ సంస్కరణ ఆశించిన ఫలితాలను ఇస్తుంది. ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల వ్యవస్థలో విలీనం చేయాలన్న ప్రతిపాదనలో అత్యంత కీలకమైన అంశం బోధనా ప్రమాణాలు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ వంటి విభిన్న గ్రూపుల ద్వారా విద్యార్థులు తమ భవిష్యత్తు లక్ష్యాలకు అనుగుణంగా సబ్జెక్టులను ఎంచుకుంటున్నారు. ఇప్పుడు ఈ వేలాది మంది అధ్యాపకుల సేవలు, ఉద్యోగ భద్రత, పదోన్నతులు, పదవీ విరమణ ప్రయోజనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి. జూనియర్ కాలేజీలను నిర్వహిస్తున్న యాజమాన్యాలకు కూడా ముందస్తు మార్గదర్శకాలు అవసరం. ఈ మార్పులపై అధ్యాపక సంఘాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. ఒకవైపు సంస్కరణలు చేపడుతూనే మరోవైపు విద్యా వ్యవస్థలో పనిచేస్తున్న వారి అనుభవాన్ని, సూచనలను గౌరవించాలి. ముఖ్యంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపక సంఘాలతో విస్తృతంగా చర్చించి నిర్ణయాలు తీసుకోవాలి. విధానం ప్రకటించిన తర్వాత సమస్యలు ఎదురైనప్పుడు పరిష్కారాలు వెతకడం కంటే ముందుగానే సాధ్యాసాధ్యాలను పరిశీలించడం మెరుగైన పాలనకు నిదర్శనం.విద్యా సంస్కరణలు కాగితాలపై ఆకర్షణీయంగా కనిపించడం కంటే తరగతి గదుల్లో ఫలితాలు చూపించాలి.ప్రభుత్వ పాఠశాలల్లో తగినంత మంది ఉపాధ్యాయులు లేకపోవడం, మౌలిక వసతుల కొరత, ప్రయోగశాలలు, గ్రంథాలయాల సమస్యలు ఇంకా అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో 11, 12 తరగతులను కూడా పాఠశాలల్లో కొనసాగించాలంటే అదనపు తరగతి గదులు, నిపుణులైన అధ్యాపకులు, ఆధునిక ప్రయోగశాలలు, డిజిటల్ బోధనా సదుపాయాలు తప్పనిసరి. కేవలం భవనాలు నిర్మించడం లేదా తరగతుల పేర్లు మార్చడం వల్ల విద్యా ప్రమాణాలు పెరగవు. విద్యార్థులకు అర్థమయ్యే బోధన, ప్రశ్నించే స్వేచ్ఛ, ప్రయోగాత్మక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాలు అందించాలి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య విద్యా అంతరాలను తగ్గించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులతో సమానంగా ఉన్నత విద్యా అవకాశాలను అందిపుచ్చుకునే స్థాయికి చేరుకోవాలి.మొత్తానికి తెలంగాణలో ప్రతిపాదిత 10+2 విద్యా సంస్కరణను కేవలం పరిపాలనా మార్పుగా కాకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతాయుతమైన కార్యక్రమంగా చూడాలి. పదో తరగతి తర్వాత ఏ ఒక్క విద్యార్థి కూడా పరిస్థితుల కారణంగా చదువుకు దూరం కాకూడదన్న లక్ష్యం సాధించగలిగితే అది విద్యారంగానికి ప్రయోజనకరమైన పరిణామమే. అయితే విద్యార్థుల భవిష్యత్తుతో ప్రయోగాలు చేయకుండా ప్రతి నిర్ణయాన్ని సమగ్ర పరిశీలన తర్వాతే అమలు చేయాలి. అధ్యాపకుల ఆందోళనలకు పరిష్కారం చూపాలి. ప్రైవేటు విద్యాసంస్థల విషయంలో స్పష్టమైన విధానం ప్రకటించాలి. ప్రవేశ పరీక్షల సన్నద్ధతకు ఆటంకం కలగకుండా చూడాలి. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేలా తగిన బడ్జెట్, సిబ్బంది, మౌలిక వసతులు కల్పించాలి. విద్యా విధానం మారడం కంటే విద్యార్థుల జీవితాల్లో మార్పు రావడమే నిజమైన సంస్కరణ. తరగతుల సంఖ్య పెరగడం కాదు.. విద్యా ప్రమాణాలు పెరగాలి. పాఠశాలల పరిధి విస్తరించడం కాదు.. ప్రతి పేద విద్యార్థికి ఉన్నత విద్యా అవకాశాలు అందాలి. అప్పుడే తెలంగాణ విద్యారంగంలో చేపట్టిన ఈ మార్పులకు సార్థకత చేకూరుతుంది.

బాలలంటే అమితమైన ప్రేమ..
దేశ నిర్మాణంలో చెరగని ముద్ర!



- **భారత తొలి ప్రధానమంత్రిగా విశేష సేవలు**
- **1889 నవంబర్ 14న జన్మించిన జవహర్‌లాల్ నెహ్రూ**
- **చిన్నారులంటే ప్రత్యేక అభిమానం.. చాచా నెహ్రూగా గుర్తింపు**
- **ఆధునిక భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన నాయకుడు**

డెస్క్, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): భారత స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశ తొలి ప్రధానమంత్రి బాధ్యతల వరకు జవహర్‌లాల్ నెహ్రూ జీవితం ఎన్నో మలుపులతో సాగింది. స్వతంత్ర భారతదేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన నాయకుల్లో ఆయన ఒకరు. 1889 నవంబర్ 14న అలహాబాద్‌లో జన్మించిన నెహ్రూ చిన్ననాటి నుంచే విద్య, పుస్తక పఠనం, సామాజిక అంశాలపై ఆసక్తి కనబరిచారు. ఆయన తండ్రి మోతీలాల్ నెహ్రూ ప్రముఖ న్యాయవాది, స్వాతంత్ర్య ఉద్యమ నాయకుడు. కుటుంబ నేపథ్యం, విద్యాభ్యాసం నెహ్రూ ఆలోచనా విధానంపై ప్రభావం చూపాయి. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించిన ఆయన అనంతరం భారతదేశానికి తిరిగి వచ్చి స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలు, స్వాతంత్ర్య సమరయోధుల పోరాటం ఆయన రాజకీయ జీవితానికి దిశానిర్దేశం చేశాయి.

మహాత్మా గాంధీ నాయకత్వంలో సాగిన స్వాతంత్ర్య ఉద్యమంలో నెహ్రూ కీలకంగా వ్యవహరించారు. భారత జాతీయ కాంగ్రెస్‌లో ముఖ్యమైన బాధ్యతలు నిర్వహిస్తూ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లో పాల్గొన్నారు. స్వాతంత్ర్యం కోసం సాగిన పోరాటంలో పలుమార్లు జైలు జీవితాన్ని కూడా అనుభవించారు. యువతలో జాతీయ భావాలను పెంపొందించడం, స్వరాజ్య సాధన కోసం ప్రజలను సమీకరించడం వంటి కార్యక్రమాల్లో ఆయన ముందుండేవారు. 1929లో లాహోర్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన సంపూర్ణ స్వరాజ్య తీర్మానానికి నాయకత్వం వహించారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలనే ఆకాంక్షను ప్రజల్లో బలంగా తీసుకెళ్లడంలో ఈ పరిణామం కీలకంగా నిలిచింది.

1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం నెహ్రూ దేశ తొలి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటికి దేశం విభజన, శరణార్థుల సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, నిరక్షరాస్యత, పేదరికం వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఆయన ప్రణాళికాబద్ధమైన ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు. భారీ పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులు, విద్యాసంస్థలు, శాస్త్రసాంకేతిక పరిశోధనా కేంద్రాల ఏర్పాటుకు ప్రోత్సాహం అందించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం, లౌకిక భావన, శాస్త్రీయ దృక్పథం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ఆధునిక భారత నిర్మాణానికి పునాదులు వేశారు.

నెహ్రూ వ్యక్తిత్వంలో పిల్లల పట్ల ఉన్న ప్రేమ ప్రత్యేకంగా గుర్తింపు పొందింది. చిన్నారులతో కలిసిమెలిసి ఉండటం, వారి మాటలు వినడం, వారి భవిష్యత్తు గురించి ఆలోచించడం ఆయనకు ఎంతో ఇష్టం. పిల్లలే దేశ భవిష్యత్తు అనే నమ్మకంతో వారి విద్య, ఆరోగ్యం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చేవారు. అందుకే చిన్నారులు ఆయనను ప్రేమగా చాచా నెహ్రూ అని పిలిచేవారు. పిల్లల పట్ల ఆయనకున్న అభిమానానికి గుర్తుగా ఆయన జన్మదినమైన నవంబర్ 14ను భారతదేశంలో బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. ఈ రోజున పాఠశాలల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ పిల్లల హక్కులు, విద్య, సంక్షేమం, ప్రతిభకు ప్రాధాన్యతనిస్తారు. నెహ్రూ ఆశయాలను గుర్తుచేసుకుంటూ చిన్నారుల భవిష్యత్తు కోసం సమాజం తీసుకోవాల్సిన బాధ్యతలను చర్చిస్తారు.

రాజకీయ నాయకుడిగానే కాకుండా రచయితగా కూడా నెహ్రూ తనదైన ముద్ర వేశారు. భారత చరిత్ర, సంస్కృతి, స్వాతంత్ర్య ఉద్యమం, ప్రపంచ పరిణామాలపై ఆయనకు విశేష అవగాహన ఉండేది. జైలు జీవితంలో రచించిన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా', 'గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ', 'యాన్ ఆటోబయోగ్రఫీ' వంటి పుస్తకాలు ఆయన ఆలోచనా విధానాన్ని, దేశ చరిత్రపై ఉన్న అవగాహనను ప్రతిబింబిస్తాయి. అంతర్జాతీయ స్థాయిలోనూ భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి కృషి చేశారు. అలీన విధానం ద్వారా ప్రపంచ దేశాల మధ్య శాంతి, సహకారం, స్వతంత్ర విదేశాంగ విధానానికి ప్రాధాన్యతనిచ్చారు. ఆయన పాలనా కాలంలో తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు భారతదేశ రాజకీయ, ఆర్థిక చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి.

1964 మే 27న జవహర్‌లాల్ నెహ్రూ మరణించారు. అయినప్పటికీ భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పాత్ర, దేశ తొలి ప్రధానమంత్రిగా చేసిన సేవలు, బాలల పట్ల చూపిన అభిమానం నేటికీ గుర్తుండిపోయాయి. ఆయన జన్మదినం సందర్భంగా నిర్వహించే బాలల దినోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదు.. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, సమాన అవకాశాలు, ఆరోగ్యం, భద్రత కల్పించాల్సిన బాధ్యతను గుర్తుచేసే సందర్భం కూడా. పిల్లల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత, దేశభక్తి, మానవతా విలువలను పెంపొందించాలనే ఆశయం నేటి తరానికి కూడా ఎంతో అవసరం. నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన జీవితాన్ని, సేవలను స్మరించుకోవడంతో పాటు చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు కోసం సమాజం మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేపై ఘోర ప్రమాదం.. 20 వాహనాలను ఢీకొట్టిన కంటైనర్

- నాగ్‌పూర్ నుంచి జల్నా వైపు వెళ్తుండగా ఘటన
- రహదారిపై నిలిచిన వాహనాలను వెనుక నుంచి ఢీకొట్టిన ట్రక్కు
- పలువురు ప్రయాణికులకు గాయాలు
- వాహనాల్లో చిక్కుకున్న వారిని రక్షించి ఆసుపత్రులకు తరలింపు



నాగ్‌పూర్, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): మహారాష్ట్రలోని సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వే పై భారీ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నాగ్‌పూర్ నుంచి జల్నా వైపు వెళ్తున్న కంటైనర్ ట్రక్కు అదుపుతప్పి రహదారిపై నిలిచిన వాహనాలను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో సుమారు 15 నుంచి 20 వాహనాలు ప్రమాదానికి గురయ్యాయి. దీంతో ఎక్స్‌ప్రెస్‌వేపై ఒక్కసారిగా ఆందోళనకర పరిస్థితి నెలకొంది.

రహదారిపై నిలిచిన వాహనాలను కంటైనర్ ట్రక్కు వేగంగా ఢీకొట్టడంతో పలు వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వరుసగా వాహనాలు ఢీకొనడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాద తీవ్రతకు కొన్ని వాహనాల్లో ఉన్న వారు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న సహాయక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. దెబ్బతిన్న వాహనాల్లో చిక్కుకున్న వారిని బయటకు తీసి, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రులకు తరలించారు.

కంటైనర్ ట్రక్కు ఢీకొన్న వాహనాలు రహదారిపై నిలిచిపోవడంతో ఆ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించి రహదారిని క్లియర్ చేసేందుకు చర్యలు చేపట్టారు. గాయపడిన వారికి వైద్య సహాయం అందించేందుకు ఏర్పాట్లు చేశారు. సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేపై ఒకేసారి ఇన్ని వాహనాలు ప్రమాదానికి గురికావడంతో ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. అయితే ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు, గాయపడిన వారి సంఖ్య, వారి పరిస్థితిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

మైక్రోసాఫ్ట్ సేవల్లో ఏడు గంటల అంతరాయం



హైదరాబాద్, నవంబరు 13 (తెలంగాణ ముచ్చట్లు): ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ వినియోగదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. మైక్రోసాఫ్ట్ 365, ఔట్‌లుక్, టీమ్స్, కోపైలట్ సహా పలు కీలక సేవలు ఏడు గంటలకు పైగా నిలిచిపోయాయి. నవంబరు 13న తలెత్తిన ఈ సాంకేతిక సమస్యతో వేలాది మంది వినియోగదారులు ఇమెయిల్లు పంపడం, స్వీకరించడం, ఫైళ్లను తెరవడం, కృత్రిమ మేధ సేవలను ఉపయోగించడంలో ఇబ్బందులు పడ్డారు. మైక్రోసాఫ్ట్ 365 అనుసంధాన సేవలపై ఆధారపడిన ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్ సేవల పైనా ఈ ప్రభావం పడింది.

ఈ అంతరాయానికి గల కారణాలను పరిశీలించిన మైక్రోసాఫ్ట్ కీలక విషయాలను వెల్లడించింది. ప్రభావిత సర్వర్లలో సురక్షిత అనుసంధానాలు ఏర్పాటు చేసే ప్రక్రియలో సమస్య తలెత్తినట్లు గుర్తించింది. ఈ ప్రక్రియపై అధిక భారం పడటంతో సర్వర్లు వినియోగదారుల అభ్యర్థనలను సకాలంలో ప్రాసెస్ చేయలేకపోయాయని తెలిపింది. మొత్తం వినియోగం పెరగడం వల్ల కాకుండా, సమాచార రవాణాను నిర్వహించేందుకు అందుబాటులో ఉన్న సర్వర్ల సంఖ్య తగ్గడమే సమస్యకు ప్రధాన కారణమని వివరించింది.

డౌన్‌డిటెక్టర్ గణాంకాల ప్రకారం, ఔట్‌లుక్ సేవల్లో అంతరాయంపై ఫిర్యాదులు శుక్రవారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో 1,38,058కు చేరాయి. ఉదయం 4.30 గంటల నాటికి ఈ సంఖ్య సుమారు 34,490కు తగ్గింది.

ఎక్స్ఛేంజ్ ఆన్‌లైన్ సేవలో సమస్య కారణంగా వెబ్‌సైట్, కంప్యూటర్, మొబైల్ ద్వారా ఔట్‌లుక్ మెయిల్ ఖాతాలను తెరవడంలో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇమెయిళ్ల చేరవేతలోనూ ఆలస్యం జరిగింది. మైక్రోసాఫ్ట్ 365లో ఇటీవల ఉపయోగించిన ఫైళ్లను తెరవడం, నిర్వాహక కేంద్రంలోని కొన్ని పేజీలను చూడటం కూడా సాధ్యపడలేదు.

కోపైలట్ చాట్ తెరుచుకోకపోవడం, సమాధానాలు అందకపోవడం వంటి సమస్యలు తలెత్తాయి. టీమ్స్‌లో సందేశాలు పంపడం, ఆన్‌లైన్ సమావేశాలు నిర్వహించడం వంటి ప్రధాన సేవలు చాలావరకు పనిచేసినప్పటికీ, క్యాలెండర్లు, సమావేశాల ఏర్పాటు, కొత్త చాట్‌ల సృష్టి వంటి కొన్ని సదుపాయాలు ప్రభావితమయ్యాయి. మైక్రోసాఫ్ట్ ప్లానర్, టు డూ, డిఫెండర్, ప్యూర్‌వ్యూ, ఫ్యాబ్రిక్, పవర్ బీఐ, షేర్‌పాయింట్ ఆన్‌లైన్, విండోస్ 365 సేవల్లోనూ సమస్యలు ఎదురయ్యాయి.

మైక్రోసాఫ్ట్ అనుసంధాన సేవల్లో సమస్య కారణంగా కొత్త కనెక్షన్లు ఏర్పాటు చేయడంలో ఇబ్బందులు ఎదురైనట్లు ఓపెన్‌ఏఐ తెలిపింది. తమ మైక్రోసాఫ్ట్ 365 అనుసంధాన సేవను ప్రభావితం చేస్తున్న సమస్య బాహ్య సేవలందించే సంస్థ వద్ద తలెత్తినట్లు ఆంత్రోపిక్ వెల్లడించింది.

అంతరాయాన్ని తొలగించేందుకు ప్రభావిత మౌలిక సదుపాయాలను పునఃప్రారంభించడంతో పాటు, సర్వర్లలో కాన్ఫిగరేషన్ మార్పులను పరీక్షించినట్లు మైక్రోసాఫ్ట్ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా సమాచార రవాణాపై ఆంక్షలు విధించి, సర్వర్ల పనితీరును పర్యవేక్షించింది. పరిస్థితి మెరుగుపడిన ప్రాంతాల్లో క్రమంగా సేవలను పునరుద్ధరించే చర్యలు చేపట్టింది. ఈ అంతరాయం కారణంగా అమెరికాకు చెందిన విద్యుత్ ట్రక్కుల తయారీ సంస్థ వర్క్‌హార్స్ గ్రూప్ తన మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాల ప్రకటనను నవంబరు 12 నుంచి 16వ తేదీకి వాయిదా వేసింది. ఇటీవల అజూర్ క్లౌడ్ సేవల్లోనూ అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో, వరుస సాంకేతిక సమస్యలు మైక్రోసాఫ్ట్ సేవల విశ్వసనీయతపై చర్చకు దారితీశాయి.

భారత్–ఇటలీ మధ్య శాస్త్ర సాంకేతిక సహకారంపై చర్చలు

- రోమ్‌లో ఇటలీ మంత్రి అన్నా మరియా బెర్నినీతో ద్వైపాక్షిక భేటీ
- ఉమ్మడి పరిశోధనలకు కొత్త అవకాశాల అన్వేషణ
- ప్రాధాన్య సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యంపై దృష్టి
- 2025–2029 ఉమ్మడి వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళికపై చర్చ



రోమ్, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): భారత్-ఇటలీ మధ్య శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించే దిశగా రోమ్‌లో కీలక చర్చలు జరిగాయి. ఇటలీ విశ్వవిద్యాలయాలు, పరిశోధనల శాఖ మంత్రి అన్నా మరియా బెర్నినీతో భారత ప్రతినిధి బృందం ద్వైపాక్షిక సమావేశం నిర్వహించింది. భారత్-ఇటలీ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఆచరణాత్మక శాస్త్రీయ సహకారంగా మార్చడంపై ప్రధానంగా చర్చించారు.

రెండు దేశాల పరిశోధనా సంస్థల మధ్య సంబంధాలను బలోపేతం చేయడం, సంస్థాగత సహకార వ్యవస్థలను మరింత పటిష్ఠం చేయడం వంటి అంశాలు సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పరస్పర ప్రయోజనకరమైన భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అభిప్రాయాలు పంచుకున్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలు, ప్రాధాన్య రంగాల్లో ఉమ్మడి పరిశోధనలకు ఉన్న అవకాశాలను ఇరు పక్షాలు పరిశీలించాయి. పరిశోధకులు, విద్యాసంస్థలు, శాస్త్ర సాంకేతిక సంస్థల మధ్య సహకారాన్ని పెంచడం ద్వారా కొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమం చేయడంపై దృష్టి సారించారు. ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేసే మార్గాలపై చర్చలు జరిగాయి.

భారత్-ఇటలీ సంబంధాలను 2023లో వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచారు. అనంతరం 2024 నవంబర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ 2025-2029 కాలానికి ఉమ్మడి వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. రెండు దేశాల మధ్య వివిధ రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసేందుకు ఈ ప్రణాళికను రూపొందించారు. తాజా సమావేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఈ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే అంశాలపై చర్చించారు. ఉమ్మడి పరిశోధనలు, సంస్థాగత సంబంధాలు, నూతన సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలను పరిశీలించారు. భారత్-ఇటలీ మధ్య ఇప్పటికే ఉన్న సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఈ చర్చలు దోహదపడనున్నాయి.

విజ్ఞానం, ఆధ్యాత్మికత కలిసే ముందుకు సాగుతాయి: ప్రధాని మోదీ

- మైసూరులో దేశంలోనే తొలి ఎల్ఈడీ డోమ్
- ప్లానిటోరియం ప్రారంభం కాస్మోస్ మైసూరుకు శ్రీకారం చుట్టిన ప్రధాని
- అంతరిక్ష రంగంలో భారత్ విజయాలను ప్రస్తావించిన మోదీ
- ఖగోళ శాస్త్రంపై ఆసక్తి పెంచేందుకు ఆధునిక కేంద్రం



న్యూఢిల్లీ, నవంబర్ 13 (తెలంగాణ ముచ్చట్లు): భారతదేశంలో విజ్ఞాన శాస్త్రం, ఆధ్యాత్మికత ఎప్పుడూ కలిసికట్టుగా ముందుకు సాగుతాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని కాలంలోనే మన పూర్వీకులు విశ్వం, గ్రహాల గమనంపై లోతైన అధ్యయనం చేశారని గుర్తుచేశారు. కర్ణాటకలోని మైసూరు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో దేశంలోనే తొలి ఎల్ఈడీ డోమ్ ప్లానిటోరియం 'కాస్మోస్ మైసూరు'ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు.

నేటి భారత యువత ఖగోళ భౌతిక శాస్త్రం, విజ్ఞాన సాంకేతిక రంగాల్లో విశేష ప్రగతి సాధిస్తోందని మోదీ ప్రశంసించారు. విశ్వంలోని అనేక రహస్యాలను తెలుసుకునేందుకు భారతీయ ఖగోళ శాస్త్రవేత్తలు సంక్లిష్టమైన గణిత లెక్కలను సమర్థంగా ఉపయోగించారని చెప్పారు. విజ్ఞాన శాస్త్రాన్ని ప్రోత్సహించడంలో మైసూరు రాజకుటుంబం చేసిన కృషిని ప్రత్యేకంగా అభినందించారు. మైసూరు విశ్వవిద్యాలయ స్థాపనతో పాటు బెంగళూరులోని భారతీయ విజ్ఞాన సంస్థ ఏర్పాటుకు భూమిని దానం చేయడం ద్వారా శాస్త్రీయ అభివృద్ధికి పునాది వేశారని గుర్తుచేశారు. అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన విజయాలను కూడా ప్రధాని ప్రస్తావించారు. చంద్రయాన్3 ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. గత ఏడాది భారత వ్యోమగామి శుభాంశు శుక్లాను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ విజయాలు దేశ యువతలో విజ్ఞాన పరిశోధనల పట్ల ఆసక్తిని మరింత పెంచుతున్నాయని పేర్కొన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ నిర్మించిన ఈ ప్లానిటోరియంను ఖగోళ విజ్ఞానంపై విద్య, పరిశోధన, శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దారు. సంప్రదాయ ప్లానిటోరియాల మాదిరిగా ప్రొజెక్టర్లను ఉపయోగించకుండా ఆధునిక ఎల్ఈడీ సాంకేతికతను వినియోగించారు. 15 మీటర్ల వెడల్పు కలిగిన వంపు తిరిగిన గోపురంపై సుమారు 6,150 ప్యానెళ్లలో 4.2 కోట్ల ఎల్ఈడీలను అమర్చారు. వీటిని తక్షణమే నియంత్రించే సాంకేతికతతో నక్షత్రాలు, గ్రహాలు, విశ్వానికి సంబంధించిన దృశ్యాలను స్పష్టంగా వీక్షించే అవకాశం కల్పించారు.

విద్యార్థులు, సాధారణ ప్రజల్లో ఖగోళ శాస్త్రంపై ఆసక్తిని పెంచేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. పరిశోధన, శిక్షణకు ఇది కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్లానిటోరియం ప్రారంభోత్సవ కార్యక్రమంలో నిర్మలా సీతారామన్, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ రాజీనామా?



ముంబై, నవంబరు 13 (తెలంగాణ ముచ్చట్లు): ప్రపంచ ప్రఖ్యాత చిప్ తయారీ సంస్థ ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ పదవికి రాజీనామా చేశారంటూ ఓ కథనం ప్రచారంలోకి వచ్చింది. మూడు వివాహేతర సంబంధాలు బయటపడటం, వాటిలో ఒకటి చైనా గూఢచారితో ముడిపడి ఉందన్న ఆరోపణలు సంస్థలో సంక్షోభానికి దారితీశాయని ఆ కథనం పేర్కొంది. అయితే ఈ పరిణామాలకు సంబంధించి విశ్వసనీయ అధికారిక ధ్రువీకరణ లేదు. ఎన్విడియా ప్రపంచంలోనే అత్యంత విలువైన సంస్థల్లో ఒకటి కావడంతో, ఈ వార్త ప్రాధాన్యం సంతరించుకుంది. అధునాతన కృత్రిమ మేధ చిప్‌ల మార్కెట్లో సుమారు 90 శాతం వాటా ఈ సంస్థకే ఉందని కథనంలో పేర్కొన్నారు. ఈ వార్త వెలువడిన వెంటనే అమెరికా మార్కెట్లో ఎన్విడియా షేర్లు భారీగా పడిపోయాయని కథనం తెలిపింది. ఒక దశలో 13 నుంచి 14 శాతానికి పైగా క్షీణించిన షేర్లు, ఆ తర్వాత కొంత కోలుకున్నాయని వివరించింది. గురువారం ట్రేడింగ్ ముగిసే సమయానికి 4.3 శాతం నష్టంతో ముగిశాయని, అనంతరం ట్రేడింగ్‌లో కొంత పుంజుకున్నాయని పేర్కొంది. షేర్ల ధర తగ్గడంతో రిటైల్ పెట్టుబడిదారులు కొనుగోళ్లకు ఆసక్తి చూపినట్లు కూడా తెలిపింది.

జెన్సన్ హువాంగ్ వైదొలిగిన నేపథ్యంలో సంస్థ ప్రధాన ఆర్థిక అధికారి కోలెట్ క్రెస్‌ను తాత్కాలిక సీఈఓగా నియమించినట్లు కథనంలో పేర్కొన్నారు. శాశ్వత వారసుడి ఎంపిక కోసం అంతర్గత, బాహ్య అభ్యర్థుల పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిపింది. అయితే ఈ నాయకత్వ మార్పుపై సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడినట్లు ధ్రువీకరణ లేదు. మాజీ ఆపిల్ సీఈఓ టిమ్ కుక్ పేరును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించినట్లు కూడా కథనం పేర్కొంది.

చైనా మార్కెట్‌కు ఎన్విడియా చిప్‌ల విక్రయాలను కొనసాగించేందుకు హువాంగ్ గతంలో ప్రయత్నించారని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయని కథనం వివరించింది. చైనాకు చిప్‌ల ఎగుమతులపై అమెరికా విధానాలు, జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలు ఈ పరిణామాలతో చర్చనీయాంశమయ్యే అవకాశం ఉందని విశ్లేషించింది. అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్ సహా కొందరు అధికారుల పాత్రపైనా ప్రశ్నలు తలెత్తినట్లు పేర్కొంది.

ఓలాకు రూ.10 లక్షల జరిమానా



హైదరాబాద్, నవంబరు 13 (తెలంగాణ ముచ్చట్లు): క్యాబ్ బుకింగ్ సమయంలోనే ప్రయాణికుల నుంచి అదనపు డబ్బులు వసూలు చేసేలా ప్రోత్సహిస్తున్న ఓలా విధానంపై కేంద్ర వినియోగదారుల రక్షణ సంస్థ (సీసీపీఏ) చర్యలు తీసుకుంది. ఈ విధానాన్ని అన్యాయమైన వ్యాపార పద్ధతిగా, వినియోగదారులను తప్పుదోవ పట్టించే చర్యగా పరిగణిస్తూ ఓలా క్యాబ్ సేవల సంస్థ ఏఎన్ఐ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ.10 లక్షల జరిమానా విధించింది. అంతేకాకుండా ఈ విధానాన్ని తక్షణమే నిలిపివేయాలని ఆదేశించింది.

సీసీపీఏ చీఫ్ కమిషనర్ నిధి ఖరే, కమిషనర్ అనుపమ్ మిశ్రా ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఓలా యాప్‌లో డ్రైవర్ కోసం అన్వేషిస్తున్న సమయంలో 'టిప్' పేరుతో అదనపు మొత్తం చెల్లించే అవకాశం కల్పించారని అధికారులు గుర్తించారు. ఇలా చెల్లిస్తే త్వరగా క్యాబ్ లభించే అవకాశాలు పెరుగుతాయని యాప్‌లో సందేశాలు ప్రదర్శించేవారు. అనంతరం ఈ ఫీచర్ పేరును 'యాడ్ ఆన్'గా మార్చినప్పటికీ, దాని విధానంలో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదని సీసీపీఏ పేర్కొంది.

'టిప్ ఇస్తే త్వరగా రైడ్ లభించవచ్చు', 'త్వరగా రైడ్ నిర్ధారణ కావాలంటే అదనంగా చెల్లించండి' వంటి సందేశాలు వినియోగదారుల్లో అపోహలు కలిగించేలా ఉన్నాయని సంస్థ అభిప్రాయపడింది. అదనపు మొత్తం చెల్లిస్తే క్యాబ్ త్వరగా దొరుకుతుందనే భావన కలిగించడం తప్పుదారి పట్టించడమేనని స్పష్టం చేసింది. సందేశాల్లో 'అవకాశం ఉండొచ్చు' వంటి పదాలు ఉపయోగించినప్పటికీ, వినియోగదారులపై పడే ప్రభావం మారదని పేర్కొంది.

యాడ్ ఆన్ చెల్లింపులు డ్రైవర్‌కు రైడ్ కేటాయించే ప్రక్రియపై ప్రభావం చూపవని ఓలా చెబుతున్నప్పటికీ, యాప్‌లో మాత్రం అదనపు చెల్లింపుతో త్వరగా క్యాబ్ లభించే అవకాశం ఉందని సూచించడాన్ని సీసీపీఏ తప్పుబట్టింది. అంతేకాకుండా యాడ్ ఆన్ చెల్లింపులు ఉన్న రైడ్ అభ్యర్థనలను డ్రైవర్లు తక్కువగా అంగీకరిస్తున్నారనే సమాచారాన్ని వినియోగదారులకు వెల్లడించలేదని గుర్తించింది. సూచించిన అదనపు మొత్తాలను ఏ ప్రాతిపదికన నిర్ణయిస్తున్నారో కూడా వివరించలేదని పేర్కొంది. ఈ చర్యలు వినియోగదారుల రక్షణ చట్టం2019లోని సెక్షన్ 2(28)(iv) ప్రకారం కీలక సమాచారాన్ని దాచిపెట్టినట్లేనని తేల్చింది.

సాధారణంగా సేవ పూర్తయిన తర్వాత స్వచ్ఛందంగా ఇచ్చే మొత్తాన్నే టిప్ అంటారు. అయితే ప్రయాణం ప్రారంభం కాకముందే టిప్ చెల్లించేలా ప్రోత్సహించడం ద్వారా స్వచ్ఛంద చెల్లింపును ముందస్తు చెల్లింపుగా మార్చినట్లవుతుందని సీసీపీఏ పేర్కొంది. ఫీచర్ పేరును 'టిప్' నుంచి 'యాడ్ ఆన్'గా మార్చినంత మాత్రాన ఆ విధానం స్వభావం మారదని స్పష్టం చేసింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in